ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
5
సోమవారం 10 నవంబరు 2025



భూ కబ్జాదారుల్లో గుబులు



నకిలీ పట్టాల భూమిలో సాగుచేసిన పంట

పాపిరెడ్డిపల్లె సర్వేనెంబర్ 146/1, 146/2లో సర్వే చేస్తున్న రెవెన్యూ సిబ్బంది



- భూముల వివరాలు సిద్ధం
- రూ.లక్ష తీసుకొని పాసుబుక్కు ఇచ్చారంటున్న బాధితులు
- బద్దలుకానున్న ఆక్రమణల కోట

కడప, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో భూకబ్జాలకు సీకెదిన్నె, పెండ్లిమర్రి, సిద్దవటం, బద్వేలు, గోపవరం, బి.కోడూరు, కాశినాయన, కలసపాడు, పోరుమామిళ్ల, ఖాజీపేట, లింగాల, సింహాద్రిపురం, తొండూరు మండలాలు ప్రఖ్యాతిగాంచాయి. ఇవన్నీ ఒక ఎత్తయితే బ్రహ్మంగారిమఠం మండలం ఒక ఎత్తు. ఎకరా.. రెండెకరాలు కాదు సుమారు 15 వేల ఎకరాల భూములు ఇక్కడ ఆక్రమణకు గురైనట్లు ఆరోపణలు ఉన్నాయి. అయితే కబ్జా చేసిన భూములను కాపాడుకునేందుకు నిన్నటి దాకా వైసీపీలో ఉన్న బ్యాచ్ ఇప్పుడు టీడీపీలో చేరింది. వాగులు, వంకలు, కొండలు అడ్డంగా ఆక్రమించారు. ఆర్ఎస్ఆర్‌లో అటవీశాఖ, వాగు అని స్పష్టంగా ఉన్నప్పటికీ అప్పుడు పనిచేసిన అధికారులు అడ్డగోలుగా వెబ్‌ల్యాండ్‌లో ఎక్కించేసారు. ఇప్పుడు కొరడా ఝులిపిస్తుండడంతో కబ్జా గ్యాంగుల్లో కలవరం మొదలై విచారణను అడ్డుకునేందుకు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్‌పై తీవ్రస్థాయిలో ఒత్తిడి తెస్తున్నట్లు తెలుస్తోంది.

15 వేల ఎకరాల కబ్జా

ఇది పుణ్యక్షేత్రం కావడంతో మఠంలో ఇంటిస్థలాలకే మంచి డిమాండ్ ఉంది. బ్రహ్మంసాగర్‌లో నీరు పుష్కలంగా ఉండడంతో మండల వ్యాప్తంగా భూగర్భజలాలు మెండుగా ఉన్నాయి. దీంతో కొండల్లో ఉన్న భూమి కూడా ఎకరా రూ.5లక్షల దాకా పలుకుతోంది. ఇవి సారవంతమైన భూములు కావడంతో వరితో పాటు పండ్లతోటలకు అణువైన నేలలు. దీంతో ఇక్కడ భూములకు డిమాండ్ బాగుంది. గత ఐదేళ్లుగా కోస్తా జిల్లా నుంచి భూములు కొనేందుకు ఎక్కువగా రైతులు కలసపాడు, కాశినాయన, పోరుమామిళ్ల, బ్రహ్మంగారిమఠాలకు వచ్చి ఇక్కడ భూముల కొనుగోళ్ల పట్ల ఆసక్తి కనబరుస్తుండడంతో పది సెంట్ల భూమి కూడా మంచి ధర ఉంది. ఈ నేపథ్యంలో ఇష్టారాజ్యంగా భూములను వైసీపీ హయాంలో నమోదు చేశారు. ప్రాథమిక సమాచారం మేరకే బి.మఠం మండలంలో సుమారు 15 వేల ఎకరాల భూములు ఆక్రమణకు గురైనట్లు చెబుతారు. దీనిపై విచారణ సాగుతోంది.

బయటకు వస్తున్న ఎలుకలు

భూకబ్జాలపై సీరియస్ యాక్షన్ మొదలుకావడంతో అక్కడున్న నకిలీపట్టాలతో భూములు కబ్జా చేసిన వారు బయటకు వస్తున్నారు. బి.మఠం మండలంలోని ఓ నేత రూ.1.50 లక్షలు ఇస్తే రెండు ఎకరాల భూమి పట్టా ఇప్పిస్తానని చెప్పడంతో ఓ రైతు ఐదు ఎకరాల కోసం సుమారు రూ.7లక్షలు ఇచ్చారు. ఆయన చెప్పినట్లుగానే డి.ఫాం, పట్టాదారు పాసుబుక్కులు ఇచ్చారు. అయితే భూకబ్జాలపై పత్రికల్లో వార్తలు రావడం, విచారణకు ఆదేశించడంతో ఆ రైతు తనకిచ్చిన పట్టాల గురించి రెవెన్యూలో ఫిర్యాదు చేయగా అవి డూప్లికేట్ అని తేలింది. దీంతో బాధితులు మోసపోయారని నేరుగా అధికార యంత్రాంగాన్ని కలిశారు.

సోమిరెడ్డిపల్లెలోని ప్రభుత్వ భూమిని అడ్డగోలుగా సొంత భూమిలా వ్యవహరించారు. దీని కోసం రూ.10లక్షలు తీసుకున్నారు. అక్కడ పంట సాగుచేసేందుకు ప్రయత్నించగా అది ప్రభుత్వ భూమి అని తేలింది. విచారణ మొదలు కాకముందే అక్రమార్కులు ఒక్కొక్కరు బయటకు వస్తున్నారు. డబ్బు తీసుకొని పట్టాలిస్తున్న వారి పేర్లు కూడా చెబుతుండడంతో ప్రాథమిక సమాచారంతోనే భూకబ్జాల గుట్టు తెలిసింది. ఆక్రమణ నుంచి బయటపెట్టేందుకు వైసీపీ నేతలు అధికారులతోనే నేరుగా బేరం పెట్టారనే చర్చ సాగుతోంది.

కాలజ్ఞాని మద్విరాట్ వీరబ్రహ్మేంద్రస్వాముల వారి గడ్డలో కొందరు భూకబ్జాదారులు చెలరేగిపోయారు. వైసీపీ హయాంలో అధికారాన్ని అడ్డం పెట్టుకొని అడ్డగోలుగా ఆక్రమణలకు తెరలేపారు. భూములు ఆక్రమించడమే కాకుండా భూమిలేని పేదలకు కూడా నకిలీ పట్టాలను కట్టబెట్టారు. పాస్‌బుక్కుకు రూ.లక్ష నుంచి రూ.2లక్షల వరకు తీసుకొని పట్టాలిచ్చి రెవెన్యూ అధికారులకు చిల్లరకొట్టి వెబ్‌ల్యాండ్‌లో ఎక్కించుకున్నారు. అయితే ఇప్పుడు ఆ భూముల గుట్టురట్టు అవుతోంది. ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ సొంత మండలంలో భూకబ్జాలపై దృష్టిపెట్టారు. కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, ఆర్డీఓ చంద్రమోహన్‌కు ఫిర్యాదు చేయడంతో 20 ప్రత్యేక టీంలను రంగంలోకి దింపారు. ఆ బృందాలు క్షేత్రస్థాయిలో విచారణ మొదలెట్టాయి. ఇది భూకబ్జారాయుళ్లలో వణుకు పుట్టిస్తోంది.

భూ ఆక్రమణలు ఇలా

రెవిన్యూ గ్రామం	ఆక్రమణకు గురైన భూములు (ఎకరాల్లో)
మల్లేపల్లె	465.21
ముడమాల	926.6
గుండాపురం	494.64
దిగువ నేలటూరు	1468.29
బి.అగ్రహారం	408.18
బి.నరసింహాపురం	44.53
దిరసవంచ	1551.84
ఎగువ నేలటూరు	447.81
నాగిశెట్టిపల్లె	662.19
రేకులకుంట	1190.94
సోమిరెడ్డిపల్లె	2162.59
పడుగురాళ్లపల్లె	1691.67
పాపిరెడ్డిపల్లె	1184.97
జి.నరసింహాపురం	300.80
చౌదరివారిపల్లె	814.81
గొడ్డవీడు	379.03
జంగంరాజుపల్లె	261.62
సంగంపల్లె	340.15
మొత్తం	**14700.43**

ఈ భూములన్నీ అడ్డగోలుగా దోచేశారు.



ప్రతి సర్వేనెంబర్ ఎంక్వైరీ చేస్తాం

బి.మఠం మండలంలో జరిగిన భూకబ్జాలపై 20 టీములను విచారణ కోసం ఏర్పాటు చేశాం. ఆరోపణలు వచ్చిన ప్రతి సర్వే నెంబర్‌ను పరిశీలిస్తాం. అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములను తిరిగి స్వాధీనం చేసుకుంటాం.

- ఆర్డీఓ, చంద్రమోహన్, బద్వేలు

ఉరుసులో సినీ నటులు సుమన్, ఆలీ



పెద్ద దర్గాలో ప్రార్థనలు చేస్తున్న సుమన్, ఆలీ



కడప కల్చరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కడపలో వెలసిన ప్రఖ్యాత పెద్ద దర్గా ఉరుసులో సినీ నటులు సుమన్, ఆలీ ఆదివారం పాల్గొన్నారు. వారికి దర్గా ప్రతినిధులు స్వాగతం పలికి దర్గా మజార్ల వద్ద ప్రత్యేక పూలచాదర్ సమర్పించి ప్రార్థనలు నిర్వహించారు. దర్గా బయట ఆలీ విలేకరులతో మాట్లాడుతూ కులమతాలకతీతంగా చాలామంది పెద్దదర్గాను అత్యంత విశ్వాసంతో దర్శించుకుంటున్నారని, ఉత్సవాలకు తనను గెస్ట్‌గా పిలవడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. దాదాపు పదిహేను సంవత్సరాల తర్వాత తిరిగి గంథం ఉత్సవాలకు రావడం చాలా ఆనందంగా ఉందని, పెద్దదర్గాను దర్శించి మనసులో అనుకున్న కోరికలు నెరవేరగలవని భక్తుల ప్రగాఢ విశ్వాసమని తెలిపారు. ఇదిలా ఉండగా కొత్తగా శివాజీతో సంప్రదాయం సినిమాతో పాటు రాజశేఖర్‌తో ఓ తమిళ రిమేక్ సినిమా, హిందీ సినిమా, ఓ తమిళ సినిమా చేస్తున్నట్లు తెలిపారు. మన దేశం భిన్నమతాలకు, ఆచారాలకు నిలయమని ప్రముఖ సినీ నటుడు సుమన్ తెలిపారు. పెద్ద దర్గా ఉరుసు ఉత్సవాలకు హాజరవ్వాలని పలుమార్లు అనుకున్నప్పటికీ రాలేకపోయానని ఇప్పటికీ నా కోరిక నెరవేరిందన్నారు. తాను ఇవాళ ఈ స్థాయిలో ఉన్నానంటే అభిమానులతో పాటు ఆ భగవంతుని ఆశీస్సులతోనే అన్నారు. తాను పుట్టి పెరిగింది చెన్నైలో అయినప్పటికీ మా ఇంటి పక్కనే ఓ ముస్లిం కుటుంబం ఉండేదని, వారితో చిన్నప్పటి నుంచి అనుబంధం ఉండేదన్నారు. సమాజంలో అన్ని మతాలను గౌరవించాలని, అందరితో స్నేహపూర్వకంగా మెలగి సంతోషంగా జీవించాలన్నారు. కాగా అర్ధరాత్రి దర్గా పీఠాధిపతి ఊరేగింపు కార్యక్రమం జరిగింది. భక్తులు విశేషంగా హాజరై వీక్షించారు.



కిటకిటలాడుతున్న దర్గా ప్రాంగణం

రెచ్చిపోయిన రేషన్ మాఫియా

- యథేచ్ఛగా బియ్యం రవాణా చేస్తూ..
- అడ్డొచ్చిన పోలీసులపై దాడికి యత్నం
- సంఘటనపై పోలీసు శాఖ సీరియస్



పోలీసులు స్వాధీనం చేసుకున్న అక్రమ బియ్యం తరలించిన వాహనం

ప్రొద్దుటూరు రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరులో రేషన్ మాఫియా ఆగడాలు రోజురోజుకు మితిమీరిపోతున్నాయి. అక్రమ రవాణాను అడ్డుకొన్న పోలీసులను సైతం లెక్కచేయకుండా వారిపై వాహనాన్ని ఎక్కించే ప్రయత్నం చేసి దర్జాగా బియ్యం తరలించిన సంఘటన శనివారం రాత్రి ప్రొద్దుటూరు పట్టణంలో చోటు చేసుకుంది. ఈ ఘటనపై తీవ్రంగా పరిగణించిన పోలీసులు నిందితుల కోసం ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టగా వాహనాన్ని అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల వివరాల మేరకు.. ప్రొద్దుటూరుకు చెందిన ఓ వ్యక్తి ఈశ్వర్‌రెడ్డినగర్‌లోని సున్నంబట్టి వీధిలో ఓ రేషన్ దుకాణం నుంచి బియ్యం బస్తాలను అక్రమంగా తరలించేందుకు రంగం సిద్ధం చేశారు. విషయం తెలుసుకున్న స్పెషల్ బ్రాంచ్ పోలీసులు రామక్రిష్ణ, సత్యనారాయణలు వెంబడించి వాహనాన్ని స్థానిక వసంతపేటలోని సాయిబాబా దేవాలయం వద్ద అడ్డుకున్నారు. అనంతరం బ్లూకోల్ట్స్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ లోపే టీచర్స్ కాలనీ, గిడ్డంగి వీధికి చెందిన బియ్యం అక్రమ రవాణాకు చెందిన బడా వ్యక్తులు అక్కడకు చేరుకుని పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలోనే ఓ అక్రమార్కుడి కుమారుడు అక్కడకు చేరుకుని వాహనాన్ని పక్కన పెడతానని చెప్పి.. వాహనాన్ని స్టార్ట్ చేసి అక్కడి పోలీసుల మీదకు వాహనాన్ని ఎక్కించేందుకు యత్నించాడు. రెండుమూడు సార్లు ఇలా చేయడంతో చాకచక్యంగా పోలీసులు ప్రమాదం నుంచి తప్పుకోవడంతో అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ బియ్యాన్ని జమ్మలమడుగులోని ఓ రైస్ మిల్లుకు చేర్చినట్లు తెలుస్తోంది. విషయం తెలుసుకున్న పోలీసు అధికారులు సంఘటనను తీవ్రంగా పరిగణలోకి తీసుకుని నిందితుల కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు. బియ్యం రవాణాకు ఉపయోగించిన వాహనాన్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనలో ప్రధాన నిందితులైన టీచర్స్ కాలనీకి చెందిన బియ్యం అక్రమార్కుడి కుమారుడితో పాటు వాహన డ్రైవర్ కోసం గాలిస్తున్నామని, త్వరలో అరెస్టు చూపుతామని వన్‌టౌన్ సీఐ తిమ్మారెడ్డి తెలిపారు.

సీఎం పర్యటనకు ముమ్మర ఏర్పాట్లు

- 12న చిన్నమండెంకు రాక



ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కో-ఆర్డినేటర్ వెంకట్రమణ, కలెక్టర్‌నిశాంత్ కుమార్, ఎస్పీ ధీరజ్ కునుబిల్లి తదితరులు

చిన్నమండెం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈనెల 12వ తేదీ చిన్నమండెం మండలానికి రానున్న సందర్భంగా జిల్లా యంత్రాంగం మొత్తం పర్యటన ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఉదయం నుంచి హెలిప్యాడ్, సభా ప్రాంగణాలను ఉన్నతాధికారులు పరిశీలిస్తూ తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. ముఖ్యమంత్రి పర్యటనల కో-ఆర్డినేటర్ వెంకట్రమణ, కలెక్టర్ నిశాంత్‌కుమార్, ఎస్పీ ధీరజ్ కునుబిల్లి, జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, మంత్రి మండిపల్లి తమ్ముడు మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డితో కలిసి హెలిప్యాడ్, భద్రతా అంశాలపై చర్చించారు. అలాగే ట్రాఫిక్‌కు సంబంధించిన అంశాలు, భోజన వసతులు సభా ప్రాంగణాలకు ఎంత దూరంలో ఉండాలి అన్న అంశాల గురించి జిల్లా అధికారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. హెలిప్యాడ్ దగ్గర కార్యకర్తలతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సమావేశమై వారితో చర్చించనున్నారు. అనంతరం హెచ్‌పీ పెట్రోల్ బంక్ వెనుక ఉన్న నూతన గృహాలను సీఎం చేతుల మీదుగా ప్రారంభించిన అనంతరం కడప-బెంగళూరు జాతీయ రహదారి ఆనుకుని ఉన్న దేవగుడిపల్లి బాహూజీనగర్ కాలనీ మధ్యలో బహిరంగ సభలో ముఖ్యమంత్రి ప్రసంగిస్తారు. అలాగే అక్కడ పీ4కు సంబంధించిన వారి గురించి ప్రకటిస్తారు. అనంతరం ముఖ్యమంత్రి తిరిగి హెలిప్యాడ్ వద్దకు చేరుకుని తిరుగు ప్రయాణమవుతారు. ఈ ఏర్పాట్లను జిల్లా యంత్రాంగం నిర్విరామంగా పర్యవేక్షిస్తూ అన్ని శాఖల అనుసంధానంతో ముందుకు సాగుతున్నారు. ముఖ్యమంత్రి పర్యటనల ఏర్పాట్లలో రాయచోటి ఆర్డీవో శ్రీనివాసులు, రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్, మదనపల్లె సబ్ కలెక్టర్ చల్లా కల్యాణి, రాజంపేట సబ్ కలెక్టర్ భావన, అడిషనల్ ఎస్పీ వెంకటాద్రి, ఎస్‌బీ సీఐ రాజా రమేశ్, వివిధ శాఖల అధికారులు, స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

దక్షిణ భూకైలాసం.. బాలప్ప కోన
7

యువకుడి దారుణ హత్య

- పోలీసుల అదుపులో నిందితులు..?



మృతుడు అబుబకర్

కడప క్రైం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఇరువురి మధ్య ఉన్న మనస్పర్థల కారణంగా ఓ నిండు ప్రాణం బలైంది. పోలీసుస్టేషన్‌కు కూతవేటు దూరంలోనే ఈ హత్య ఉదంతం చోటు చేసుకోవడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. కడప టూటౌన్ పోలీసుల వివరాల మేరకు..

కడప నగరం కుమ్మరికుంటకు చెందిన సయ్యద్ మగ్బుల్ కుమారుడు సయ్యద్ అబుబకర్ అలియాస్ గౌస్ బాషా(25)కు నగరానికి చెందిన అబుజార్, యూసఫ్‌లతో మనస్పర్థలు ఉండేవి. ఈ క్రమంలో శనివారం అర్ధరాత్రి రెండు గంటల సమయంలో అబుబకర్ కడప నగరం లో జరిగే ఉరుసుకు వచ్చాడు. ఆ సమ యంలో అబుజార్, యూసఫ్‌లు మరో ఏడుగురు స్నేహితులతో కలిసి అక్కడికి వచ్చారు. అబుబకర్ వారికి ఎదురుపడడంతో వారి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో యూసఫ్ తన వద్ద ఉన్న కత్తి తీసుకొని కడుపులో పొడిచి గట్టిగా కత్తితో పొట్టను చీల్చడంతో అబుబకర్ అపస్మారక స్థితిలో పడిపోయాడు. దీంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వ డంతో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. తీవ్రంగా గాయపడిన అబుబకర్‌ను వైద్య పరీక్షల నిమిత్తం రిమ్స్‌కు తరలించగా చికి త్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు 9 మందిపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీ సులు తెలిపారు. కాగా నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిసింది. నిందితుల్లో ముగ్గురు మైనర్లు ఉన్నట్లు సమాచారం. ఇదిలా వుండగా.. గత నాలుగు రోజులుగా కడప నగరంలో పెద్దదర్గా ఉరుసు మహోత్సవం జరుగుతోంది. వేలాది మంది భక్తుల రాకపోకలతో రద్దీగా వుంటోంది. పోలీసు బందోబస్తు కూడా ఎక్కువే ఉంది. ఇలాంటి సమయంలోనూ దర్గా సమీపంలో ఈ హత్య జరగడంతో నగరవాసులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు.

విచారణ అధికారిగా అడిషనల్ ఎస్పీ

కడప, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి వైఎస్ వివేకా కుమార్తె, అల్లుడిపై తప్పుడు కేసు పెట్టించిన అధికారులపై నమోదైన కేసుకు విచారణ అధికారిగా కడప అడిషనల్ ఎస్పీ ప్రకాష్‌బాబును ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ఆదివారం ఆదేశాలు జారీ అయ్యాయి. మాజీ మంత్రి వైఎస్ వివేకా హత్య కేసులో సీబీఐ ఎస్పీ రామ్‌సింగ్, సునీత, రాజశేఖర్‌రెడ్డిలు తనను బెదిరిస్తున్నారని, ఒత్తిడి తెస్తున్నారని, పీఏ కృష్ణారెడ్డి ఫిర్యాదు మేరకు అప్పట్లో వారి ముగ్గురిపై కేసు నమోదు చేశారు. ఆ కేసు తప్పుడు కేసు అని కోర్టు క్వాష్ చేసింది. కానీ గత నెల 22న కుళాయప్ప అనే వ్యక్తి కర్నూలు పట్టణంలో డీజీపీకి తప్పుడు కేసు విషయమై విచారించి న్యాయం చేయాలని ఫిర్యాదు చేశారు. దీంతో జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి పులివెందులకు బదిలీ చేశారు. ఈ కేసులో రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ రాజేశ్వరరెడ్డి, ప్రస్తుతం రాజుపాలెంలో ఏఎస్ఐగా పనిచేస్తున్న రామకృష్ణారెడ్డిలపై కేసు నమోదైంది. రాజేశ్వరరెడ్డి అడిషనల్ ఎస్పీగా బాధ్యతలు చేపడుతూ పదవీ విరమణ చేశారు. దీంతో కడప అడిషనల్ ఎస్పీ ప్రకాష్‌బాబును విచారణ అధికారిగా నియమించారు. ఆ కేసుకు సంబంధించి ప్రకాష్‌బాబు ఆధ్వర్యంలో విచారణ సాగనుంది. త్వరలోనే రాజేశ్వరరెడ్డి, రామకృష్ణారెడ్డిలను అడిషనల్ ఎస్పీ ప్రకాష్‌బాబు బృందం విచారించనుంది.

ప్రతి పౌరుడికి న్యాయసేవలు

- జిల్లా ప్రధాన జడ్జి యామిని



ర్యాలీ ప్రారంభిస్తున్న జిల్లా ప్రధాన జడ్జి యామిని, తదితరులు

కడప రూరల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయసేవాధికార సంస్థ ద్వారా ప్రతి పౌరుడికి న్యాయసేవలను అందిస్తున్నామని డీఎల్ఎస్ఏ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి.యామిని పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కోర్టు ఆవరణంలోని న్యాయసేవాసదన్‌లో న్యాయసేవల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సుప్రీంకోర్టు 1995లో న్యాయసేవల దినోత్సవాన్ని ఏర్పాటు చేసి ప్రతి ఏడాది నవంబరు 9న నిర్వహించుకుంటున్నామన్నారు. ప్రజలకు వారి చట్టబద్ధమైన హక్కులు, బాధ్యతల గురించి అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. మహిళలు, వికలాంగులు, మానవ అక్రమ రవాణా బాధితులు, ప్రకృతి వైపరీత్యాల బాధితులైన బలహీన వర్గాలకు ఎటువంటి రుసుం లేకుండా న్యాయసేవలను అందిస్తామన్నారు. 2024 నవంబరు నుంచి 2025 నవంబరు వరకు జిల్లా వ్యాప్తంగా 1761 న్యాయవిజ్ఞాన సదస్సుల ద్వారా 85,909 మందికి ప్రత్యక్షంగా చట్టాలపై అవగాహన కల్పించామని తెలిపారు. 573 మంది నిరుపేద పిల్లలకు ఆధార్ రిజిస్ట్రేషన్, 297 మంది అనార్గనైజర్స్‌కు ఈ శ్రమకార్డులను, 57 మంది ప్రత్యేక అవసరాలున్న పిల్లలకు కిడ్స్, ఒంటరి మహిళలకు పింఛన్లు ఇప్పించామన్నారు. గిరిజన ప్రాంతాల్లో మెడికల్ క్యాంపులను నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేయించామని, షెల్టర్ హోమ్‌లు, ఓల్డేజ్ హోమ్‌లు, చిల్డ్రన్స్ హోమ్‌లు విజిట్ చేసి వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ అధికారుల సహకారంతో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ప్రజలకు సేవలు అందిస్తోందని, పోలీస్‌శాఖ సహకారంతో జిల్లాలోని కొన్ని గ్రామాలను దత్తత తీసుకుని వాటిని వాజ్యములు లేని గ్రామాలుగా తీర్చిదిద్దుతున్నామన్నారు. అనంతరం నల్సా పథకాలను, లీగల్ సర్వీసెస్ అథారిటీ యాక్టు 1987ను తెలియపరిచారు. న్యాయసేవల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. అనంతరం జిల్లా కోర్టు ప్రాంగణం నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు అక్కడి నుంచి తిరిగి కోర్టు ప్రాంగణం వరకు ర్యాలీ నిర్వహించారు.

ట్రాన్స్‌జెండర్ సారికకు రాష్ట్ర ఉత్తమ పారాలీగల్ వలంటరీ అవార్డు


2025 రాష్ట్ర ఉత్తమ పారాలీగల్ వలంటరీ అవార్డుకు ట్రాన్స్‌జెండర్ సారిక ఎంపికైంది. ఈ మేరకు సారిక ఆదివారం ఢిల్లీలో నిర్వహించిన న్యాయసేవల దినోత్సవానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఏడవ అదనపు జిల్లా న్యాయమూర్తి జి.రమేష్‌కుమార్, డీఎల్ఎస్ఏ ఇన్‌చార్జ్ సెక్రటరీ ఆసిఫా సుల్తానా, ఆయా కోర్టుల జడ్జిలు ఎం.రేష్మ, ఎం.ఈశ్వర్ వెంకటప్రసాద్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాఘవరెడ్డి, ఆయా ప్రభుత్వ శాఖల అధికారులు, ప్యానల్ న్యాయవాదులు, పారాలీగల్ వలంటీర్లు, ప్రొఫెసర్లు, లెక్చరర్లు, టీచర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

దక్షిణ భూకైలాసం.. బాలప్ప కోన



బాలప్పకోనలో కొలువైన పరమేశ్వరుడు, పార్వతీదేవి





పడవ ఆకారంలో ఉన్న బాలప్పకోన సముదాయం



సహజసిద్ధంగా దూకుతున్న గంగమ్మ

కొండాపురం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రకృతి మనకు దేవుడిచ్చిన వరం. అలాంటి ప్రకృతిలో సాక్షాత్తు పరమేశ్వరుడు కొలువై ఉంటే ఇంకే ముంది. తనివి తీరా చూడాలనిపిస్తుంది. ప్రకృతి అందాలతో పాటు దైవానుభూతిని కలిగించే విశిష్టమైన క్షేత్రం బాలప్పకోన. కొండాపురం మండలం తాళ్లప్రొద్దుటూరు గ్రామానికి ఉత్తర దిక్కున సుమారు 20కిలోమీటర్ల దూరంలో ఎర్రమలకొండల్లో బాలప్పకోన ఉంది. పడవ ఆకారంలో కొండ గుహల్లో పార్వతీపరమేశ్వరులు కొలువై దక్షిణ భూకైలాసంగా విరాజిల్లుతోంది. రాయలసీమ రత్నగర్భంలోని గొప్ప శైవక్షేత్రాల్లో బాలప్ప కోన (బాల మల్లేశ్వర కోన) ఒకటి. పరమేశ్వరుడు పార్వతీ సమేతంగా గంగను వెతుక్కుంటూ ఇక్కడికి వచ్చినట్లు పురాణకథలు చెబుతున్నాయి. అందుకే ఈ క్షేత్రాన్ని దక్షిణభూకైలాసం అని పిలుస్తుంటారు. ఈ క్షేత్రంలో ఎప్పటి నుంచో మునీశ్వరులు నివాసమున్నట్లు అనేక కథలు ఉన్నాయి.

బాలప్ప కోన స్థలపురాణం

ఈ క్షేత్రం ఉన్న కొండలో పడవ ఆకారంలో గుహలున్నాయి. పడవలా ఉన్న పైభాగం నుంచి నీరు గలగల ప్రవహిస్తూ ఉంటుంది. లోయకు ఇరువైపులా ప్రకృతి సౌందర్యం రమణీయంగా ఉంటుంది. స్థలపురాణం ప్రకారం ఈ కొండకు పడవ ఆకారం రావడానికి కారణం.. భద్రుడు అనే మునీశ్వరుడు ఇక్కడ తపస్సు చేసుకుంటుండగా అతన్ని పరీక్షించడానికి శివపార్వతులు పదితలల పామును సృష్టించి విషాన్ని చిమ్ముతూ భద్రుని మింగేలా చేశారు. అపార శివభక్తుడైన భద్రుడు ఆ పాము భయంకర రూపాన్ని చూసినప్పటికీ, భయపడక శివనామస్మరణ చేయడంతో ఆ సర్పం మాయమై శివపార్వతులు దర్శనం ఇచ్చి భద్రునికి మోక్షాన్ని ప్రసాదించారని, అప్పటి నుండి భద్రుని పేర ఈ కొండ ప్రాంతం బాలప్పకోనగా విరాజిల్లుతోందని పురాణ గాథలు చెబుతున్నాయి.

బాలప్పకోన చేరుకోవాలంటే..

బాలప్పకోనకు తాళ్లప్రొద్దుటూరు వైపు నుంచి వచ్చేవారు బొందలదిన్నె, సంకేపల్లె మీదుగా, అలాగే తాడిపత్రి వైపు నుంచి వచ్చే వారు పెన్నా సిమెంటు ఫ్యాక్టరీ మీదుగా బాలప్పకోన చేరుకోవచ్చు.

ప్రకృతి రమణీయంగా బాలప్ప కోన

అతి పురాతనమైన శివలింగం బాలప్పకోనలో కొలువై ఉంది. ప్రకృతి రమణీయంగా ఉన్న ఈ కొండల్లో గతంలో సుమారు 70 అడుగుల శివలింగం ఉండేదని స్థానికుల కథనం. గతంలో మునులు నిచ్చెనలు వేసుకొని పూజలు చేసేవారని, కాలక్రమేణా శివలింగం పూడిపోయి ప్రస్తుతం 5 అడుగులకు చేరుకుందని భక్తులు చెబుతున్నారు. ప్రకృతిసిద్ధంగా కొలువుదీరిన పరమేశ్వరుని దర్శించుకోవడానికి కార్తీకమాసంతో పాటు సోమవారం, వివిధ పర్వదినాల్లో అనేకమంది భక్తులు తరలివస్తారు. ముఖ్యంగా కార్తీకమాసంలో అఖండదీపారాదన చేస్తారు.



బాలప్పకోనలోని కోనేరు

ఊరేగింపును ఉత్సాహంగా జరుపుకోండి

● రెచ్చగొట్టే పనులకు దిగొద్దు : ఎస్పీ



మాట్లాడుతున్న ఎస్పీ నచికేత్ విశ్వనాథ్

చెన్నూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం మూడో సోమవారం సందర్భంగా చెన్నూరు నాగేశ్వర ఆలయం నుంచి నిర్వహించే ఊరేగింపును ఉత్సాహంగా నిర్వహించుకోవాలని, ఎలాంటి రెచ్చగొట్టే పనులకు దిగొద్దని ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ అన్నారు. గత కొద్దిరోజులుగా ఈ ఊరేగింపు విషయమై రెండు వర్గాల మధ్య వాదోపవాదాలు జరుగుతున్న విషయంపై ఎస్పీ ఆదివారం సాయంత్రం చెన్నూరు రెవెన్యూ కార్యాలయానికి వచ్చారు. అక్కడ జాయింట్ కలెక్టర్ అదితిసింగ్‌తో కలిసి ఇరువర్గాలతో మాట్లాడారు. పండుగలు, ఊరేగింపులు అన్ని మతాల్లో ఉంటాయని, అందరూ ఒకరికొకరు సహకరించుకోవాలన్నారు. ఏ రూటు ప్రకారం చెబుతామో అదే రూటులో ఎలాంటి శబ్ద కాలుష్యమైన డ్రమ్స్ ఏర్పాటు చేయవద్దని, కేవలం మంగళవాయిద్యాలతో నిర్వహించుకోవాలన్నారు. అదే సమయంలో ఊరేగింపునకు ఆటంకాలు కలిగించవద్దని తెలిపారు. పోలీసుపరంగా ఎలాంటి సంఘర్షణలు, సమస్యలు తలెత్తకుండా భద్రత కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ప్రకాశ్ బాబు, ఆర్డీవో జాన్‌ఇర్విన్, డీఎస్పీలు వెంకటేశ్వర్లు, బాలస్వామిరెడ్డి, సుధాకర్, అబ్దుల్‌కరీం, సీఐలు కృష్ణారెడ్డి, రోషన్, ఈదురుబాషా, తహసీల్దార్ సరస్వతి, ఎస్ఐ శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులు

గాలివీడు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎగువ గొట్టివీడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు కె.శివ, ఎస్.సనాకౌసర్ ఎంపికైనట్లు ఆ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీనివాసులు తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో కడప మున్సిపల్ కార్పొరేషన్ ఉర్దూ హైస్కూల్‌లో శనివారం నిర్వహించిన జిల్లా స్థాయి ఖోఖో అండర్-17 పోటీల్లో ఈ విద్యార్థులు మెరుగైన ప్రతిభ కనపర్చి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సదాశివారెడ్డి, ఉపాధ్యాయ బృందం విద్యార్థులను అభినందించి రాష్ట్ర స్థాయిలో కూడా ప్రతిభ కనపర్చాలని ఆకాంక్షించారు.

రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు...



ఎంపికైన గౌతమి

లక్కిరెడ్డిపల్లె, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జాండ్రపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని గౌతమి రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైనట్లు పీడీ రెడ్డయ్య తెలిపారు. ఈ నెల 8న కడప మున్సిపల్ గ్రౌండ్‌లో జరిగిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీలో ప్రతిభ కనబర్చడంతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు సిద్దేశ్వర, ఉపాధ్యాయులు చక్రపాణి హర్షం వ్యక్తం చేశారు.

13 లోగా దరఖాస్తు చేసుకోండి

సీకేదిన్నె, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి కౌసల్ వికాస్ యోజన కార్యక్రమంలో భాగంగా డ్రైవింగ్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటుకు ఈ నెల 13వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌చార్జి ఉపరవాణా కమిషనర్ ఎం.వీర్రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా నైపుణ్యంతో కూడిన డ్రైవింగ్ స్కిల్స్ అభివృద్ధి చేయడంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ ఆర్థికసాయంతో డ్రైవింగ్ ట్రైనింగ్ సెంటర్లు ఏర్పాటు చేయడమే దీని ఉద్దేశ్యమన్నారు. ఇందులో భాగంగా 10 లక్షల జనాభాకు ఒక డ్రైవింగ్ ట్రైనింగ్ సెంటర్ చొప్పున మంజూరు చేసేందుకు నిర్ణయించడమైందన్నారు. ఈనెల 13 సాయంత్రం అయిదు గంటలలోపు ఆసక్తిగల అభ్యర్థులు డీపీఆర్ కాపీలను, ఇతర అటాచ్‌మెంట్లను ఉపరవాణా కార్యాలయం వైఎస్ఆర్ కడపజిల్లా ఇవ్వాల్సి ఉందన్నారు. ఇందుకు కావాల్సిన అర్హతలు ఆసక్తిగల సంస్థ ఎంజీవో, ట్రస్ట్ , కోఆపరేటివ్ సొసైటీ, తయారీదారుడు, ఫార్మ్‌అయి ఉండాలన్నారు. ఎన్జీవో అయితే తప్పనిసరిగా దర్పం పోర్టల్‌లో రిజిస్టర్ అయి ఉండాలన్నారు. ఈ సంస్థ గత మూడు సంవత్సరాల ఆడిట్ రిపోర్ట్స్, టర్నోవర్ సర్టిఫికెట్లు అందించాలన్నారు. ఇటువంటి సంస్థకు సొంతంగా లేదా కనీసం పది సంవత్సరాల లీజు కలిగిన రెండు ఎకరాల స్థలం, సిమ్యులేటర్, ట్రైనింగ్ వాహనాలు, వర్క్‌షాపు, రెండు క్లాస్‌రూమ్స్, ఇంటర్నెట్, తదితర సదుపాయాలు ఉండాలన్నారు. మరిన్ని వివరాలకు రవాణా శాఖ వెబ్‌సైట్‌లో పొందవచ్చన్నారు.

ద్విచక్రవాహనం ఢీ... ఒకరి మృతి



మృతి చెందిన కొండయ్యనాయుడు

రాయచోటి-నేతాజీసర్కిల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కర్నూలు- చిత్తూరు జాతీయ రహదారి సంబేపల్లె మండలం మొటుకువాండ్లపల్లె సబ్‌స్టేషన్ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. అతని భార్యకు తీవ్రగాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు... సుండుపల్లె మండలం రామవాండ్లపల్లెకు చెందిన కొండయ్య నాయుడు (51) రత్నమ్మ దంపతులు ద్విచక్రవాహనంలో అన్నప్పగారిపల్లెకు వెళుతుండగా మొటుకువాండ్లపల్లె క్రాస్ వద్ద పీలేరు వైపు వెళుతున్న కారు వెనుక నుంచి ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన కొండయ్యనాయుడు అక్కడికక్కడే మృతి చెందగా, రత్నమ్మ తీవ్రంగా గాయపడింది. మృతదేహాన్ని రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయపడిన మహిళను తిరుపతికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవికుమార్ తెలియజేశారు.

మట్కా బీటరు అరెస్టు - నగదు స్వాధీనం



మట్కా నిర్వాహకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ, ఎస్ఐ

ప్రొద్దుటూరురూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలోని రిలయన్స్ పెట్రోలు బంకు వద్ద వడ్ల లక్ష్మీనారాయణ అనే మట్కా నిర్వాహకున్ని అరెస్టు చేసి అతని వద్ద నుంచి రూ.8,250 నగదు, మట్కా స్లిప్పులను స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ సీఐ నాగభూషణం తెలిపారు. పోలీసులవివరాల మేరకు లక్ష్మీనారాయణ గత కొంత కాలంగా టీ బంకు నిర్వహణ ముసుగులో మట్కా నిర్వహిస్తుండగా సమాచారం అందడంతో దాడి చేసి అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. ఇతనితోపాటు రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలోని మట్కా బీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. మట్కా వలన కుటుంబాల ఆర్థిక నాశనం గురించి ఈ జూదం వలన కలిగే నష్టాలను వివరిస్తూ మరోసారి మట్కా ఆడుతూ పట్టుబడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గుర్తుతెలియని వృద్ధుడు మృతి



ఎర్రగుంట్ల, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గుర్తుతెలియని వృద్ధుడు ఆదివారం మృతి చెందినట్లు ఎర్రగుంట్ల పోలీసులు తెలిపారు. గత నెల 13వ తేదీన ముద్దనూరు రోడ్డులోని సిమెంట్ ఫ్యాక్టరీ సమీపంలో వున్న ఆంజనేయస్వామి ఆలయం వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు.

పాత పింఛన్‌ను పునరుద్ధరణ చేయాలి

కడప ఎడ్యుకేషన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీ మేరకు రాష్ట్రంలో సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పింఛన్ పద్ధతిని పునరుద్ధరించాలని ఏపీ కాంట్రిబ్యూటరీ పింఛన్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెంకట జనార్దనరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం కడప నగరం నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలలో జరిగిన జిల్లా నూతన కార్యవర్గ ఎంపికలో అంకిరెడ్డిపల్లె మదన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షుడిగా, జి.హరేంద్ర ప్రధాన కార్యదర్శిగా, నర్రా రజనీకాంత్ ఆర్థిక కార్యదర్శిగా, మార్పురి ప్రభావతి మహిళా అధ్యక్షురాలిగా ఎంపికయ్యారు. కార్యక్రమంలో వెంకట జనార్దనరెడ్డి, సీపీఎస్ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని ఇద్దరు యువకులు మృతి



మృతి చెందిన యువకులు

మైదుకూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీవీ సత్రం కూడలి సమీపంలో జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. యువకులు కడప పట్టణం బెల్లంమండి వీధికి చెందిన సాయిసంజయ్(22), చిన్నచౌకు అశోక్‌నగర్‌కు చెందిన సంతోష్(23)లుగా గుర్తించారు. సాయి బంగారుషాపులో పనిచేస్తుండగా సంతోష్ కడప అన్నమాచార్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో చదువుతున్నట్లు సమాచారం. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఎస్ఐ చిరంజీవి కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రొద్దుటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

డ్రాగా ముగిసిన క్రికెట్ మ్యాచ్‌లు



61 పరుగులు చేసిన తాహీర్ (కడప), 102 పరుగులు చేసిన మణిదీప్ (చిత్తూరు)

కడప స్పోర్ట్స్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కడపలో వివిధ జట్ల మధ్య జరుగుతున్న ఏసీఏ సౌత్‌జోన్ అండర్-14 మెన్ మల్టీడే ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ మ్యాచ్‌లు ఆదివారం డ్రాగా ముగిశాయి. నగర శివారులోని రిమ్స్ సమీపంలో ఉన్న వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ స్టేడియంలో కడప-అనంతపురం జట్ల మధ్య జరిగిన క్రికెట్ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన కడప జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌లో 66.2 ఓవర్లలో 198 పరుగులకు ఆలౌట్ అయింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌లో ఆట ముగిసే సమయానికి 28 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 54 పరుగులు చేసింది. కాగా 54 పరుగుల ఓవర్‌నైట్ స్కోర్‌తో రెండవ రోజైన ఆదివారం తిరిగి బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు 71.5 ఓవర్లలో మొత్తం 147 పరుగులకే చేతులెత్తేసింది. దీంతో కడప జట్టుకు 51 పరుగుల మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యత లభించింది. బౌలింగ్ విభాగంలో కడపకు చెందిన బౌలర్ భానువర్షిత్‌రెడ్డి 6 వికెట్లు సాధించి కట్టడి చేశారు. రెండో ఇన్నింగ్స్‌లో కడప జట్టు ఆట ముగిసే సమయానికి 46 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 149 పరుగులు చేసింది. ఇందులో తాహీర్ 61 పరుగులు చేశారు. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసినట్లు నిర్వాహకులు తెలిపారు.

కేవోఆర్‌ఎం మైదానంలో

కేవోఆర్‌ఎం క్రికెట్ మైదానంలో చిత్తూరు-కర్నూలు జట్ల మధ్య జరుగుతున్న మరో మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన చిత్తూరు జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌లో కేవలం 28.3 ఓవర్లలో 63 పరుగులకు కుప్పకూలిన సంగతి తెలిసిందే. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు సైతం 34.3 ఓవర్లలోనే కేవలం 56 పరుగులు చేసి ఆలౌట్ అయింది. రెండో ఇన్నింగ్స్‌కు దిగిన చిత్తూరు జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 26 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 78 పరుగులు చేసింది. ఓవర్‌నైట్ స్కోర్ 78 పరుగులతో ఆదివారం తిరిగి రెండవ ఇన్నింగ్స్‌కు దిగిన చిత్తూరు జట్టు 81.2 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 289 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. ఇందులో మునిదీప్ 102 పరుగులు చేసి నాటౌట్‌గా క్రీజ్‌లో నిలిచారు. దీంతో చిత్తూరు జట్టు రెండు ఇన్నింగ్స్‌లకు గాను 296 పరుగులు సాధించింది. కాగా ఇందుకు ప్రతిగా రెండవ ఇన్నింగ్స్‌కు దిగిన కర్నూలు జట్టు ఆట ముగిసే సమయానికి 32 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 135 పరుగులు చేసింది. ఇందులో మోక్షజ్ఞరెడ్డి 63 పరుగులు చేయగా మరో బ్యాటర్ షాకిత్ 60 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో నిలిచారు. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసినట్లు వెల్లడించారు.

భక్తిశ్రద్ధలతో నగరేశ్వరస్వామికి రుద్రాభిషేకం

● పూజల్లో పాల్గొన్న హంపీ విరూపాక్ష పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామిజీ



పార్వతీసమేత నగరేశ్వరస్వామికి పూజలు నిర్వహిస్తున్న విద్యారణ్య భారతి స్వామిజీ, కుంకుమార్చన చేస్తున్న ఆర్యవైశ్య సువాసినులు

ప్రొద్దుటూరుటౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక గవిని సర్కిల్‌లోని వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ఉద్యానవనంలో ఆరుద్రా నక్షత్రం సందర్భంగా ఆదివారం నగరేశ్వరస్వామికి భక్తిశ్రద్ధలతో రుద్రాభిషేకం నిర్వహించారు. నూతనంగా చరప్రతిష్ఠ చేసిన నగరేశ్వరస్వామి స్వరూప స్ఫటికలింగానికి, పార్వతీ సమేత నగరేశ్వరస్వామి విగ్రహాలకు శ్రీ జగద్గురు శంకరాచార్య హంపీ విరూపాక్ష విద్యారణ్య మహాసంస్థానాధిపతి శ్రీ విద్యారణ్య భారతి స్వామిజీ చేతుల మీదుగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. లోకకల్యాణార్థం గణపతి పూజ, స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, కుంకుమార్చన నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిజీ మహాశివుని గొప్పతనాన్ని, కార్తీకమాస ప్రాముఖ్యతను, దీప విశిష్ఠతను గురించి భక్తులకు వివరించారు. 102 మంది ఆర్యవైశ్య సుహాసినులు సామూహికంగా పార్వతీమాతకు కుంకుమార్చన చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు బుశెట్టి రామమోహన్ రావు, కార్యదర్శి మురికి నాగేశ్వరరావు, భక్తులు పాల్గొన్నారు.

చంద్రన్న.. రైతుల పక్షపాతి : పుత్తా నరసింహారెడ్డి



నీటిని వదులుతున్న పుత్తా నరసింహారెడ్డి

వల్లూరు నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రైతు లేనిదే రాజ్యమే లేదనే విశ్వాసంతో సీఎం చంద్రబాబునాయుడు రైతుల పురోగతికి వెన్నుదన్నుగా ఉంటూ రైతు పక్షపాతిగా ఖ్యాతి గాంచారని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి తెలిపారు. ఆదివారం మండల పరిధిలోని అంబవరం చెరువు నుంచి దాదాపు 270 ఎకరాలకు సంబంధించి ఆయకట్టు రైతులకు నీటిని వదిలి మాట్లాడారు. రైతుల కోసం నిరంతరం పనిచేస్తున్నామని, ఎక్కడా రాజీ పడకుండా రైతన్నల అభివృద్ధి కోసం ప్రత్యేక సంక్షేమ పథకాలను ఏర్పాటు చేశారని తెలిపారు. గతంలో కూడా ఉల్లి రైతులకు మేలు చేసిన ఘనత చంద్రన్నకే దక్కిందన్నారు. ప్రధానంగా అంబవరం ఆయకట్టు కింద ఉన్న రైతులు చెరువు నీటి ద్వారా పొలాలను పండించుకుని బాగుండాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం కృతనిశ్చయంతో కాల్వను ఏర్పాటు చేసిందని తెలిపారు. అనంతరం ప్రజల నుంచి వచ్చిన అర్జీలను పరిశీలించి వాటిని సంబంధిత అధికారులకు చేరవేశారు. కార్యక్రమంలో అంబవరం చెరువు అధ్యక్షుడు ఎం.శివారెడ్డి, డీఈ జగదీశ్వర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, రామసుబ్బారెడ్డి, చంద్రారెడ్డి, పాపిరెడ్డి ఓబుల్‌రెడ్డి, సుధా మదన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇరు వర్గాల ఘర్షణ

● కేసు నమోదు

మదనపల్లెఅర్బన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం, సరస్వతినగర్‌కు చెందిన ఇరువురు ఘర్షణ పడడంతో తాలూకా పోలీసులు ఒకరిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు సీఐ కళావెంకటరమణ పేర్కొన్నారు. పోలీసుల వివరాలిలా.. మండలంలోని సరస్వతీనగర్ వాసి రామూర్తి నాయక్‌కు, అదే ప్రాంతానికి చెందిన భవానీతో పాత గొడవలు ఉండేవి. అయితే అప్పట్లో రాజీపడి రూ.40 వేలు రామ్మూర్తినాయక్ చెల్లించారు. ఆదివారం సాయంత్రం రోడ్డుపై భవానీ, అతని భార్య నడుచుకుంటూ వెళుతుండగా రామ్మూర్తినాయక్‌కు ఎదురుగా వచ్చి దూర్భాషలాడారు. ఈ మేరకు భవానీపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేయాలి

పులివెందుల రూరల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): బీజేపీ నాయకులు, కార్యకర్తలు ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేయాలని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి శశిభూషణ్‌రెడ్డి సూచించారు. ఆదివారం పులివెందులలో బీజేపీ మండల అధ్యక్షుడు వై.నవీన్ ఆధ్వర్యంలో మండలస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శశిభూషణ్‌రెడ్డి మాట్లాడుతూ తమ ప్రాంతంలోని ప్రధాన సమస్యలపై అవగాహన కలిగిఉండాలని, మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లి సంబంధిత అధికారులతో చర్చించి ప్రజాసమస్యలను పరిష్కరించాలన్నారు. అలాగే ప్రతి సోమవారం జరిగే గ్రీవెన్స్ కార్యక్రమాల్లో మండల కార్యకర్తలు తప్పనిసరిగా పాల్గొని ప్రజ సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషిచేయాలన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు నవీన్ మాట్లాడుతూ బీజేపీ ప్రవేశపెట్టి అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. పార్టీని మరింత బలోపేతం చేసేందుకు అందరం కలిసికట్టుగా ముందుకెళ్దామన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి ఆర్.విజయలక్ష్మి, బీజేపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఎస్.లక్షుమయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రమోహన్, నాయకులు తిరుపాల్‌రెడ్డి, శ్రీరాములు, అనిల్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రబుల్ ఇంజన్‌గా కూటమి ప్రభుత్వం : తులసిరెడ్డి

వేంపల్లె, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): చంద్రబాబు నేతృత్వంలో డొక్కు ఇంజన్ ప్రభుత్వంగా, ట్రబుల్ ఇంజన్ ప్రభుత్వంగా తయారైందని రాజ్యసభ మాజీ సభ్యుడు, కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో ఎద్దేవా చేశారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో కేంద్రం నుంచి రూ.34698కోట్లు గ్రాంట్ రూపంలో రాష్ట్రానికి రాగా, కూటమి పాలనలో 2024-25లో కేవలం రూ.20135కోట్లు మాత్రమే గ్రాంట్ రూపంలో వచ్చిందన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో తొలి ఆరుమాసాలలో కేంద్రం నుంచి కేవలం రూ.4014కోట్లు మాత్రమే గ్రాంట్ వచ్చిందని, అదే సమయంలో 2023-24లో రూ.21270కోట్ల గ్రాంట్ వచ్చిందన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో ఒకే కూటమి అధికారంలో ఉంటే రాష్ట్రానికి ప్రయోజనం కలుగుతుందని నరేంద్రమోదీ, చంద్రబాబు పదేపదే చెబుతూ ఉంటారని, ఇపుడు వారు ఏం సమాధానం చెబుతారని తులసిరెడ్డి ప్రశ్నించారు. అప్పులు చేయడంలో కూటమి ప్రభుత్వానికి ఆస్కార్ అవార్డు ఇవ్వాలని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన 17 నెలల్లోనే రూ.2.27లక్షలకోట్లు అప్పు చేసి ఆల్‌టైం రికార్డు సృష్టించిందన్నారు.

పంట రక్షణకు విద్యుత్ సరఫరా ఇవ్వడం నేరం

సింహాద్రిపురం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): రైతులు తమ పొలాల్లోని పంటలను పందుల నుంచి రక్షించుకోవడానికి 11కేవీ విద్యుత్ లైన్లకు వైర్లను తగిలించి విద్యుత్ సరఫరా తీసుకోవడం చట్టరీత్యా నేరమని విద్యుత్ ఏఈ దినేష్‌కుమార్ పేర్కొన్నారు. రైతులు రాత్రి వేళలో అలా చేయడం వల్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగి వినియోగదారులు ఇబ్బందిపడతారన్నారు. రైతులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఏఈ కోరారు.

ప్రధానోపాధ్యాయుడికి ఎమ్మెల్సీ, జడ్పీటీసీల సన్మానం

పులివెందుల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాజీవ్‌నగర్ కాలనీ మోడల్ స్కూల్ ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు అజ్జుగుట్టు మురళీనాథ్‌రెడ్డి పదవీవిరమణ పొందారు. ఈ సందర్భంగా స్థానికంగా ఉన్న ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఆయనకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి, అలాగే పులివెందుల జడ్పీటీసీ మారెడ్డి లతా రెడ్డి హాజరై మురళీనాథ్‌రెడ్డి దంపతులను ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయరంగంలో అంకితభావంతో పనిచేసి వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేశారని వారు కొనియాడారు.

భక్తిశ్రద్ధలతో మహా లింగార్చన

కడప కల్చరల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా నగరంలోని గడ్డిబజార్‌లో వెలసిన అతి పురాతన సోమసుందరేశ్వరస్వామి దేవస్థానంలో ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆదివారం పరమేశ్వరునికి మహాలింగార్చన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి భక్తిశ్రద్ధలతో 365 మృత్తికా లింగానికి (పుట్ట మన్ను లింగానికి) పూజ నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

12వ పీఆర్సీ కోసం ఇంకెంత కాలం వేచి చూడాలి

● ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు మల్లు రఘునాథరెడ్డి

వేంపల్లె, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): 12వ పీఆర్సీ కోసం ఇంకెంత కాలం వేచి చూడాలని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రఘునాథరెడ్డి అన్నారు. వేంపల్లెలోని ఓ కళ్యాణమండపంలో ఆదివారం జిల్లాస్థాయి ఎస్టీయూ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. రాష్ట్ర నాయకుడు ఇలియాస్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రఘునాథరెడ్డి మాట్లాడుతూ మధ్యంతర భృతి లేదని, సంపాదిత సెలవులు, పింఛన్ ప్రయోజనాలు, మెడికల్ రీయింబర్స్‌మెంట్ బకాయిలు మొత్తం రూ.30వేలకోట్ల చెల్లింపునకు రోడ్‌మ్యాపే లేదని, హెల్త్ కార్డులకు క్యాష్‌లెస్ చికిత్స అందడం లేదని వాపోయారు. కూటమి ప్రభుత్వం ప్రయోజనం చేకూర్చుతుందని ఆశించిన ఉద్యోగ, ఉపాధ్యాయులు తీవ్రనిరాశలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర నాయకుడు సురేశ్‌బాబు, సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర, తదితరులు పాల్గొన్నారు.



ఎస్టీయూ కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న రఘునాథరెడ్డి

క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలి

● ఎమ్మెల్యే మాధవి ● రాష్ట్ర స్థాయి అండర్-11 బాల, బాలికల బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం

కడప స్పోర్ట్స్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): చదువుతో పాటు ఏదేని క్రీడ పట్ల చిన్నతనం నుండే విద్యార్థులు ఆసక్తి పెంచుకోవాలని, ప్రతిభ కనబరిచి గొప్ప క్రీడాకారులుగా ఎదగాలని కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి సూచించారు. జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ చైర్మన్ జిలానీబాషా ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో రాష్ట్ర స్థాయి అండర్-11 బాల, బాలికల బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ చిన్నతనం నుండే క్రీడా పోటీలలో పాల్గొనడం వలన వారిలో దాగివున్న ప్రతిభ బయట పడుతుందన్నారు. దాంతో పిల్లలు మరింతగా క్రీడలలో రాణించే వీలుంటుందన్నారు. జిల్లా నుండి భవిష్యతులో జాతీయ, అంతర్జాతీయ స్థాయికి మరింత మంది క్రీడాకారులు రాణించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. అందుకు తగిన ప్రోత్సాహం అందిస్తామన్నారు. మూడు రోజుల పాటు జరుగనున్న పోటీలకు వివిధ జిల్లాల నుండి దాదాపు 250 మందికి పైగా క్రీడాకారులు, తల్లిదండ్రులు హాజరయ్యారు. కార్యక్రమంలో డీఎస్‌డీవో గౌస్‌బాషా, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు బి. శివశంకర్‌రెడ్డి, బ్యాడ్మింటన్ కోచ్‌లు పాల్గొన్నారు.




బ్యాడ్మింటన్ రాకెట్ చేతపట్టి పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాధవి, బ్యాడ్మింటన్ ఆడుతున్న క్రీడాకారులు

సర్వేయర్ల సంఘం ఎన్నికలు ఏకగ్రీవం

● అధ్యక్షుడిగా శివకుమార్, కార్యదర్శిగా దేవనాథ్‌రెడ్డి

కడప కలెక్టరేట్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కడప డివిజన్ సర్వేయర్ల సంఘం ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. నగరంలోని సర్వేయర్ల సంఘ కార్యాలయంలో ఆదివారం జరిగిన ఎన్నికల్లో కడపడివిజన్ అధ్యక్షుడిగా కె.శివకుమార్(కడప), సెక్రటరీగా దేవనాథ్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా ఖలందర్‌బాషా, జాయింట్ సెక్రటరీగా అన్నవరం సర్వేషన్(కడప), కోశాధికారిగా అంజనమ్మ, ఎగ్జిక్యూటివ్ మెంబరుగా ఖాజాహుసేన్ సుమలత, హరిప్రసాద్, వివశంకర్, అబ్దుల్‌సలాం, యశ్వంత్‌కుమార్ ఎన్నికయ్యారు.

బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలి



మాట్లాడుతున్న ఈశ్వరమ్మ

కడప మారుతీనగర్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల బ్యాక్‌లాగ్ పోస్టులను త్వరితగతిన భర్తీ చేయాలని ఆంధ్రప్రదేశ్ వికలాంగుల హక్కుల సాధన సమితి జిల్లా మహిళా అధ్యక్షురాలు పి.ఈశ్వరమ్మ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం కడపలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఆరు సంవత్సరాలుగా దివ్యాంగుల బ్యాక్‌లాగ్ ఉద్యోగాలు భర్తీ చేయకపోవడం వలన అర్హులైన దివ్యాంగులు ఎదురుచూస్తున్నారని, కూటమి ప్రభుత్వం త్వరితగతిన బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసి దివ్యాంగులకు మనోధైర్యం కల్పించాలని కోరారు.

వారసత్వ సంపదను కాపాడుకోవాలి

కడప ఎడ్యుకేషన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): భారతదేశ విలువైన వారసత్వ సంపదను కాపాడుకోవడం అందరి బాధ్యత అని ఇంటాక్ రాష్ట్ర కన్వీనర్ ఎస్వీఎస్ లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం స్థానిక కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఇంటాక్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి హెరిటేజ్ క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చారిత్రక కట్టడాలు, పురాతన దేవాలయాలు, ప్రకృతి సంపదపై విద్యార్థుల్లో అవగాహన పెంచాలన్నారు. లయన్ కె.చిన్నపరెడ్డి, రామ్‌కుమార్, ప్రిన్సిపాల్ సలీంబాష పాల్గొన్నారు.

దేశవ్యాప్త ఆందోళనను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న చలసాని వెంకటరామారావు

కడపనాగరాజుపేట, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): కార్మికుల మెడకు ఉరితాడైన నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, ఏ రంగంలో పనిచేసే కార్మికునికైనా కనీసం వేతనం రూ.26వేలు చెల్లించాలని, పని గంటలు పెంచకుండా 8 గంటల పని విధానం అమలు చేయాలని ఈనెల 25న చేపట్టనున్న దేశవ్యాప్త ఆందోళనను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చలసాని వెంకటరామారావు కోరారు. ఆదివారం స్థానిక విశ్వేశ్వరయ్య ఇంజనీరింగ్ కార్యాలయంలో ఏఐటీయూసీ సర్వసభ్య సమావేశం ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు జి.వేణుగోపాల్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వెంకటరామారావు మాట్లాడుతూ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం అమలు చేసి రెగ్యులరైజేషన్ చేయాలని, అంగన్వాడీ, ఆశా, మిడ్‌డే మీల్, ఆర్పీల వంటి స్కీం వర్కర్లందరినీ నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని, రైతు పంటల గిట్టుబాటు ధర చట్టం చేయాలని, ఉపాధి హామీ పథకాన్ని 200రోజులకు పెంచి రోజు వేతనం రూ.600 చెల్లించాలని డిమాండు చేశారు. మోదీ ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు పరిశ్రమల యాజమాన్యాలకు, కార్పొరేట్లకు లాభదాయకమని, దేశంలో కష్టించి పనిచేసే 90శాతం మంది కార్మిక వర్గానికి, ఉద్యోగులకు, అసంఘటితరంగ కార్మికులకు ఉరితాడు వంటివని విమర్శించారు. రాజ్యాంగ బద్ధంగా కార్మికులకు లభించిన హక్కులను సైతం రద్దు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నాగసుబ్బారెడ్డి, ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లికార్జునరెడ్డి, డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసీ బాదుల్లా, ఉపాధ్యక్షుడు మంజుల శ్రీరాములు, చాంద్‌బాష, కార్యదర్శులు మద్దిలేటి, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

అంధుల పాఠశాల విద్యార్థులకు జిల్లా జడ్జి అభినందనలు



విద్యార్థులను ప్రశంసిస్తున్న జిల్లా జడ్జి

కడప ఎడ్యుకేషన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): జాతీయ న్యాయ సేవల దినోత్సవం సందర్భంగా కడప జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన పోటీలో అంధుల ఉన్నతపాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ పోటీలలో పదవ తరగతి విద్యార్థి కరుణాకర్ ప్రథమ బహుమతి, 9వ తరగతి విద్యార్థిని అమీనా ద్వితీయ బహుమతి, 8వ తరగతి విద్యార్థిని బాబురెడ్డి తృతీయ బహుమతి సాధించారు. విజేతలకు జిల్లా జడ్జి యామిని స్వయంగా అభినందనలు తెలిపి ప్రశంసాపత్రాలు అందజేశారు. అలాగే టీచర్ వేపరాల ఎబెనిజర్ (డీఎస్‌ఓ అండ్ సైన్స్ టీచర్)ను కూడా ప్రత్యేకంగా సత్కరించారు. ఈ సందర్భంగా కడప ఎంఈవో-1 రఫీక్ అహ్మద్ విద్యార్థులను, ఉపాధ్యాయుని అభినందించారు.

వైవీయూలో వేతన బిల్లుల అవకతవకలు

● సీపీఐ గాలి చంద్ర

కడప ఎడ్యుకేషన్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయంలో వేతన బిల్లుల చెల్లింపుల ప్రక్రియలో భారీ ఆర్థిక అవకతవకలు చోటుచేసుకున్నాయని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర విమర్శించారు. ఆదివారం సీపీఐ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ అక్టోబర్ నెల వేతన బిల్లుగా రూ.2.94కోట్లకు పైగా బిల్లు ఇన్‌చార్జి రిజిస్ట్రార్ స్వయంగా రూపొందించి, అదేరోజు ఆమోదించడమే కాకుండా నిబంధనలకు విరుద్ధంగా తన సొంత బ్యాంకు ఖాతా నెంబర్ చేర్చినట్లు రికార్డులు వెల్లడిస్తున్నాయని తెలిపారు. వేతన చెల్లింపులు మేకర్-చెకర్ విధానంలో జరగాల్సి ఉన్నా ఒకే అధికారి మొత్తం ప్రక్రియను నిర్వహించడం నిబంధనల ఉల్లంఘన అని అన్నారు. కడపట్రెజరీ, ఉపసంచాలకుల స్థాయిలో కూడా సరైన పరిశీలన లేకుండా బిల్లు ఆమోదం పొందిందని, ఇది పర్యవేక్షణ లోపానికి నిదర్శనమన్నారు. యూనివర్సిటీ అవినీతి, అక్రమాలకు కేంద్రగా మారిందని, ఆర్థిక నేరాలకు పాల్పడిన వారిపై, అలాగే నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇతర అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అక్షరాన్ని ఆయుధంగా మలచిన సుబ్బరాయ కవి



కవిత సంపుటిని ఆవిష్కరిస్తున్న మూల

కడప కల్చరల్, నవంబర్ 9 (ఆంధ్రజ్యోతి): విద్వాన్ ఎస్.సుబ్బరాయ కవి నేటి సామాజిక అంశాలనే ప్రధాన వస్తువుగా తీసుకుని ప్రతీ అక్షరాన్ని ఆయుధంగా మలచారని జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి అన్నారు. జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో విద్వాన్ సుబ్బరాయకవి రచించిన ఇసుకలో దిద్దిన అ..ఆ..లు అనే కవిత సంపుటిని ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా హాజరైన మూల మాట్లాడుతూ ఈనాటి సమాజంలో తన ఎదుటనే జరుగుతున్న అస్థవ్యస్థ పరిస్థితులను కళ్లారా చూసిన సుబ్బరాయ కవి వాటిని తనదైనశైలిలో కవితలుగా రూపకల్పన చేశారన్నారు. విద్య, వైద్యం, కులమతాలు, అవినీతి, స్త్రీలపై అఘాయిత్యాలు, ఆత్మహత్యలు, రైతుల వ్యథలు, తదితర ఎన్నో అంశాలపై చక్కని కవిత్వం రాసారన్నారు. వైవీయూ ఆచార్యులు ఎన్.ఈశ్వర్‌రెడ్డి, సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకుడు చింతకుంట శివారెడ్డి, చరిత్ర పరిశోధకుడు మొగిలిచెండు సురేశ్, ఆధ్యాత్మికవేత్త డి.వెంకటరెడ్డి, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు కృష్ణయ్య పాలొన్నారు.

కాపుల కాపు కాచిన మిరియాల ఆదర్శప్రాయుడు



వర్ధంతి వేడుకలో పలువురు బలిజ వర్గీయులు

కడప మారుతీనగర్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కాపు, బలిజ, తెలగ, ఒంటరి కులాల ప్రజల అభ్యున్నతి కోసం కాపునాడు అనే సంఘాన్ని ఏర్పాటు చేసి కాపు వర్గీయులకు మిరియాల వెంకటరావు వెన్నుదన్నుగా నిలిచి తద్వారా ఆదర్శప్రాయుడుగా నిలిచారని పలువురు బలిజ వర్గీయులు కొనియాడారు. మిరియాల వెంకటరావు 11వ వర్ధంతిని పురస్కరించుకుని బలిజ సంఘం ప్రతినిధులు సగినాల శ్రీనివాసులు, మస్తాన్‌రావు ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక పాతబస్టాండు వద్ద వెలసిన అవధూతేంద్ర స్వామి వారి కళ్యాణ మండపంలో వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మిరియాల చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో బలిజ వర్గీయులు హరిప్రసాద్, హరీంద్రనాథ్, జీవీ రమణ, రెడ్డయ్య, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

రుద్రునికి ఆరుద్రాభిషేకం

చెన్నూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసంలో ఆదివారం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా స్థానిక మల్లేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక రుద్రాభిషేకాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారికి అభిషేకాలు చేశారు. అలాగే సంకటహర చతుర్థి సందర్భంగా వినాయక స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే మల్లేశ్వరాలయంలో చెన్నూరు వాసి మాజీ మిలిటరీ ఉద్యోగి కె.ఈశ్వరయ్య తన భార్య శశికళ జ్ఞాపకార్థం ఐదు లక్షల రూపాయలతో వంటశాల నిర్మించారు. ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి వంటశాలను ప్రారంభించారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కడప సెవెన్‌రోడ్స్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు మనోహర్ కోరారు. ఆదివారం కడప యూటీఎఫ్ ఆఫీస్‌లో మున్సిపల్ యూనియన్ జిల్లా విస్తృత సమావేశం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన మనోహర్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా మున్సిపల్ కార్మికుల సమస్యలను పాలకులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా అన్ని డిపార్ట్‌మెంట్లలో విరమణ వయసు 62 సంవత్సరాలు పెంచిందని, కానీ మున్సిపల్ కార్మికులకు 60 ఏళ్లకు నిర్ణయించడం దారుణమన్నారు. అంతేకాకుండా రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, పింఛన్ వంటి సౌకర్యాలు లేకుండా ఇంటికి పంపించడం దుర్మార్గమన్నారు. సమస్యలపైన సోమవారం అన్ని మున్సిపాలిటీలలో కమిషనర్‌కు వినతిపత్రాలు ఇవ్వాలని, బుధవారం జిల్లా వ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీలలో ఆందోళన నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కోశాధికారి ఎస్.గోపీ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి 'ఇంక్ ఏ' ప్రింట్ మేకింగ్ వర్క్‌షాప్

కడప ఎడ్యుకేషన్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయం లలిత కళావిభాగంలో ఇంక్ ఏ అన్న పేరుతో ఈనెల 10 నుంచి 15వ తేదీ వరకు ప్రింట్ మేకింగ్ వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు ఆ విభాగాధిపతి డాక్టర్ కోట మృత్యుంజయరావు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ వారం రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో ఉడ్ కట్ ప్రింటింగ్, ఇంటగ్లియో ప్రింట్ మేకింగ్ పద్ధతుల్లో శిక్షణ ఉంటుందని, తెలంగాణ తెలుగు విశ్వవిద్యాలయం ఆచార్యుడు ఎం.కృష్ణారెడ్డి, ప్రముఖ ప్రింట్‌మేకింగ్ నిపుణుడు, కళాకారుడు చలపాక అప్పలాచారి విద్యార్థులకు శిక్షణ ఇస్తారని తెలిపారు. వర్క్‌షాప్ అనంతరం రూపొందించిన చిత్రాలతో చిత్రప్రదర్శన ఉంటుందన్నారు.

రాష్ట్రస్థాయి స్టూడెంట్ మాక్ అసెంబ్లీకి కమలాపురం విద్యార్థి



తేజ నరసింహాచారి

కమలాపురం రూరల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి స్టూడెంట్ మాక్ అసెంబ్లీకి కమలాపురం విద్యార్థి ఎంపికైనట్లు ఎంఈవో సుభాషిణి తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఆమె మాట్లాడుతూ ప్రొద్దుటూరు పట్టణంలోని జార్జ్ క్లబ్బులో జరిగిన రాజ్యాంగ దినోత్సవానికి సంబంధించి జిల్లాస్థాయి స్టూడెంట్ మాక్ అసెంబ్లీలో కమలాపురం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి వడ్ల తేజ నరసింహాచారి ప్రతిభ కనబరిచినట్లు ఎంఈవో తెలిపారు. ఈనెల 26నఅమరావతి అసెంబ్లీలో జరగబోయే స్టూడెంట్ మాక్ అసెంబ్లీలో పాల్గొనే అవకాశం సాధించాడన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఖాజాపర్వీన్, ఉపాధ్యాయులు, తదితరులు విద్యార్థిని అభినందించారు.

నేడు కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్

కడప కలెక్టరేట్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): సోమవారం కలెక్టరేట్‌లోని సభాభవనంలో డయల్ యువర్ కలెక్టర్, ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరనాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9-30 గంటల నుండి 10 గంటల వరకు డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం, 10గంటల నుండి ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ నిర్వహించడం జరుగుతుందన్నారు. 1100 కాల్‌సెంటర్‌కు ఫోన్ చేసి గతంలో సమర్పించిన అర్జీలు ఏ దశలో ఉన్నాయో తెలుసుకోవచ్చన్నారు. అర్జీదారులు తమ సమస్యలను సంబంధిత మండల, డివిజన్, మున్సిపాలిటీలలో అర్జీలు సమర్పించి పరిష్కారం పొందాలని డీఆర్వో ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

నేడు డయల్ యువర్ ఎస్పీడీసీఎల్ సీఎండీ

విద్యుత్ వినియోగదారుల సమస్యల సత్వర పరిష్కారం కోసం ఈ నెల 10వ తేదీన ఉదయం 10 గంటల వరకు డయల్ యువర్ ఎస్పీడీసీఎల్ సీఎండీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా తిరుపతి, కడప, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల వినియోగదారులు 8977716661కు కాల్ చేసి తమ విద్యుత్ సమస్యలను పరిష్కరించుకోవాలని సీఎండీ తిరుపతి నుండి ఒక ప్రకటన విడుదల చేశారు.

నేడు సీపీ బ్రౌన్ జయంతి

కలెక్టరేట్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): తెలుగు భాషకు ఎనలేని సేవలు అందించిన సీపీ బ్రౌన్ 227వ జయంతి ఉత్సవాలను ఈనెల 10వ తేదీన కలెక్టరేట్‌లోని సభాభవనంలో సాయంత్రం 5 గంటలకు ఘనంగా నిర్వహిస్తున్నట్లు డీఆర్వో విశ్వేశ్వర నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్, జాయింట్ కలెక్టర్ పాల్గొంటారన్నారు. బ్రౌన్ గ్రంథాలయ పరిశోధకులుగా పని చేస్తున్న డాక్టర్ భూతపూరి గోపాల కృష్ణ 'బ్రౌన్ సాహితీ సేవ', వల్లూరు జడ్పీహైస్కూల్లో పని చేస్తున్న తెలుగు పండిట్ డాక్టర్ సాయిప్రసాద్ 'బ్రౌన్ ఉద్యోగ ప్రస్థానం-జీవితం' అనే అంశాలపై ప్రసంగిస్తారని తెలిపారు.

విలువలు గల జీవితానికే ప్రాధాన్యం

కడప సెవెన్‌రోడ్స్, నవంబరు 9(ఆంధ్రజ్యో తి): విలువలు కలిగిన జీవితానికి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని, అప్పుడే మనిషి పుట్టుకకు సార్థకత ఏర్పడుతుందని మానవత స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు ఎన్.రామ చంద్రారెడ్డి అన్నారు. కార్తీకమాసోత్సవంలో భాగంగా ఆదివారం స్థానిక నగరవనంలో వన భోజన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగార్జున డిగ్రీ మహిళా కళాశాల విద్యార్థినులు కోలాటం, జానపద గేయాలతో సందడి చేశారు. వివిధ ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సెంట్రల్ కమిటీ డైరెక్టర్ డాక్టర్ అవటాల రామాంజనేయరెడ్డి, రాటాల గోపి, సుబ్రమణ్యం, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో వ్యవస్థలన్నీ నిర్వీర్యం

● మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా

కడప ఎర్రముక్కపల్లె, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): కూటమి 18 నెలల పాలనలో వ్యవస్థలన్నీ నిర్వీర్యమయ్యాయని మాజీ ఉపముఖ్యమంత్రి అంజాద్ బాషా తెలిపారు. ఆదివారం కడప నగరంలోని అంజాద్ బాషా క్యాంప్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ విజనరీ నాయకుడినని చెప్పుకునే చంద్రబాబు సచివాలయాలకు పేర్లు మార్చడం సిగ్గుచేటన్నారు. వైద్యాన్ని సైతం వ్యాపారంగా మార్చిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. పర్యాటక రంగాన్ని సైతం ప్రైవేటుపరం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పేద మధ్యతరగతి కుటుంబాల కోసం ప్రభుత్వం ఆలోచన చేయడం లేదని, సంపన్నులకు ఎలా దోచిపెట్టాలనే తపన మాత్రమే ఉందన్నారు. మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వ వ్యతిరేకతను రాష్ట్రపతి, గవర్నర్‌లకు తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో వైసీపీ రాష్ట్రసంయుక్త కార్యదర్శి పాకా సురేష్, కార్పొరేటర్లు కె.బాబు, మహమ్మద్ షఫీ, అజ్మతుల్లా, షంషేర్, నాయకులు బసవరాజు, రవి, నాగమల్లారెడ్డి, ఇలియాస్ తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న అంజాద్ బాషా

భూ ఆక్రమణలపై చర్యలేవి

- బద్వేలులో నిత్యకృత్యంగా మారిన వైనం
- హెచ్చరికలతో సరి...చర్యలపై ఏది గురి
- ప్రభుత్వం మారినా తీరుమారని కబ్జాలు
- కఠిన చర్యలపై దృష్టిపెట్టని అధికార గణం

బద్వేలు, నవంబర్ 9 (ఆంధ్రజ్యోతి): బద్వేలులో భూ ఆక్రమణలు నిత్యకృత్యమయ్యాయి. బద్వేలు పట్టణ, మండల పరిధిలోనే కాదు నియోజకవర్గ పరిధిలోను ఆక్రమణలకు అడ్డేలేకుండా పోయింది. కనిపిస్తుంటాయి. కొందరైతే ఇతరుల డీకేటీ భూములకు నకిలీ పట్టాలు సృష్టించి వాటిని ఆక్రమించడం ,గొడవలు సృష్టించడం అలవాటుగా మారాయి. గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన అక్రమాలపై కూటమి ప్రభుత్వం రాగానే నిగ్గుతేలుస్తామని వారిపై చర్యలు చేపడతామని , కబ్జాదారుల ఆట కట్టిస్తామని చెప్పిన నాయకులు ఇప్పుడు ఏంచేస్తున్నారంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. భూ ఆక్రమణలు గుర్తించిన రెవెన్యూ అధికారులు వాటిలో హెచ్చరిక బోర్డులు నాటినా తదుపరి చర్యలపై గురిపెట్టకపోవడంతో ఆక్రమణలకు పాల్పడేవారు సర్కారు భూములను చెరబడుతున్నారు. రాత్రికి రాత్రే ఎక్స్‌కవేటర్లతో భూములు చదును చేయడం లేదా, కంప చెట్లను తొలగించి చుట్టూ స్తంభాలు నాటడం ఆ తర్వాత ఆ భూమి తనదే అన్నట్లు ధీమాగా ఉండడం జరుగుతున్నాయి. బద్వేలు మండలంలో తాజాగా జరిగిన భూ కబబ్జాలను కొన్నింటిని పరిశీలిస్తే తెలగాపురం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తిప్పనపల్లి రెవెన్యూ గ్రామ సర్వేనెం.407-1 విస్తీర్ణం ఎ3.23 సెంట్లు, సర్వేనెం.410ఎ 0.60 సెంట్లు , అలాగే సర్వేనెం.416-1 0.90 సెంట్లు ప్రభుత్వ భూమిలో అనధికారికంగా నాటి ఆక్రమించారు. సమాచారం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు గత నెల 9వ తేదీన ఆ పోల్స్‌ను తొలగించి ఆక్రమణను అడ్డుకోవడం జరిగింది. అలాగే తిప్పనపల్లె రెవెన్యూ గ్రామం సర్వేనెం.413, విస్తీర్ణం ఎ.1.70సెంట్లు , సర్వేనెం.414 ఎ, విస్తీర్ణం ఎ.4.15సెంట్లు ప్రభుత్వ భూమిని ఓ వ్యక్తి అనధికారికంగా స్తంభాలు నాటి ఆక్రమించాడు. ఈ భూ ఆక్రమణను రెవెన్యూ అధికారులు అడ్డుకుని స్తంభాలు తొలగించి ఈ భూమి ప్రభుత్వ భూమి అని ఎవరైనా ఆక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇదే గ్రామానికి చెందిన మరోవ్యక్తి తిప్పన పల్లె రెవెన్యూ గ్రామం సర్వేనెం.412-1, విస్తీర్ణం ఎ.1.63 సెంట్లు, సర్వేనెం.412ఎ, విస్తీర్ణం ఎ.1.25 సెంట్లు ప్రభుత్వ భూమిలోఅనధికారికంగా పోల్స్ నాటి ఆక్రమించారు. ఇవి చాలవన్నట్లు అట్లూరు మండలంలోని నల్లాయపల్లె సర్వేనెం.40లో ప్రభుత్వ భూమిని కొందరు ఆక్రమించుకున్నారు. బద్వేలు మండలంలోని వీరబల్లి 525 సర్వేనెంబరులో వైసీపీకి చెందిన వ్యక్తి 2.75 సెంట్లు ప్రభుత్వ భూమిని దర్జాగా ఆక్రమించుకుని కంచె ఏర్పాటు చేశారు. సమాచారం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు కంచె వేసి అక్కడి స్తంభాలను తొలగించారు. బద్వేలు మండలంలోని వీరబల్లి గ్రామంలో కూడా ప్రభుత్వ భూమిని కొందరు రాత్రికి రాత్రే ఆక్రమణ చేయడంతో రెవెన్యూ అధికారులు అక్కడ కూడా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఇలా కబ్జాలను గిట్టని వారో, మరెవరో సమాచారం అందించడం, ఫిర్యాదులు చేయడం ఇలాంటివి చేస్తేనే ఇలాంటి ఆక్రమణలు బయటకు వస్తుంటాయి. ఇలాకాకుండా చాలామటుకు బయటకు రాకుండానే కబ్జాలు కొనసాగుతూ వస్తున్నాయి అధికారులు కూడా ఫిర్యాదులు అందితేనే స్పందించే పరిస్థితిలో కనిపిస్తున్నారు కానీ మండలస్థాయిలో, గ్రామస్థాయిలో పని చేసే రెవెన్యూ అధికారులైన బాధ్యులు వీటిపై దృష్టిపెట్టి కబ్జాలను అరికట్టే పరిస్థితులు కనిపించడంలేదనే విమర్శలున్నా యి. ఇదిలా ఉంటే అధిఆకారులు స్పందించి హెచ్చరిక బోర్డులు నాటిన తర్వాత కూడా వారిపై క్రిమినల్ కేసులు పెట్టకపోవడం, అందుకు తగ్గచర్యలు చేపట్టకపోవడంతో కబ్జాదారులు పోయేదేముందంటూ ప్రభుత్వ భూమిలోకి దిగుతున్నారు. అడ్డుకుంటే వదిలేయడం లేకపోతే కబ్జా చేయడం పరిపాటిగా మారింది. మరి రెవెన్యూ ఉన్నతాధికారులైనా ఏ మేరకు కబ్జాలు అరికట్టేందుకు చర్యలు చేపడతారో వేచి చూడాలి.



ఎస్.వెంకటాపురం ప్రభుత్వ భూమి చదును చేసిన దృశ్యం (ఫైల్‌ఫొటో)



చెన్నంపల్లె గ్రామ పొలంలో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు (ఫైల్‌ఫొటో)

తహశీల్దారు ఏమన్నారంటే: బద్వేలు మండలం, మున్సిపాలిటీ ప్రాంతాలలో ఎవరైనా ప్రభుత్వ భూములను, ఇంటి స్థలాల ఆక్రమణలకు పాల్పడితే చర్యలు తప్పవని తహసీల్దారు ఉదయభాస్కర్‌రాజు హెచ్చరించారు. ఆక్రమణదారులపై రెవెన్యూ యంత్రాంగం నిఘాపెట్టి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటోందన్నారు.

కుక్కదాడిలో వృద్ధుడికి గాయాలు

కలసపాడు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కలసపాడులో ఆదివారం కుక్కదాడిలో వృద్ధుడికి గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన కర్నాటి పుల్లారెడ్డి అనే వృద్ధుడు తన పొలం వద్దకు వెళ్లివస్తుండగా కుక్క దాడి చేసి గాయపరిచింది.గత కొన్ని నెలల నుంచి కలసపాడులో వీధికుక్కలు జనాలను బెంబేలెత్తిస్తు న్నాయి. వాటిని నియంత్రించేందుకు అధికారులు ప్రయత్నం చేస్తున్నా జంతు ప్రేమికులు అడ్డుపడుతున్న ట్లు గ్రామస్థులు చెబుతున్నారు.

నేడు పలు ఆలయాల్లో కార్తీక సోమవార పూజలు

కొండాపురం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం మూడవ సోమవారం సందర్భంగా నేడు పలు శైవక్షేత్రాల్లో ప్రత్యేక పూజలు నిర్వ హించనున్నారు. మండలంలోని ప్రసిద్ధ శైవక్షేత్రాలైన బాలప్పకోన, మల్లేశ్వరకోన తో పాటు గండ్లూరు, కొండాపురం తదితర చోట్ల శివాల యాల్లో వేకువజాము నుంచే ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించ నున్నారు. బాలప్పకోన, మల్లేశ్వరకోనలో పలువురు అన్నదాన కార్యక్రమా న్ని ఏర్పాటుచేస్తు న్నారు. పలుచోట్ల భజన కార్యక్రమాలను ఏర్పాటుచేస్తు న్నారు.

ఉప్పరపల్లె ఆశ్రమంలో విద్యారణ్య భారతి స్వామి

ప్రొద్దుటూరు రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మండల పరిదిలోని ఉప్పరపల్లెలో ఉన్న సద్గురు సమర్ధనారాయణ ఆశ్రమాన్ని కర్ణాటకలోని హంపీకి చెందిన విరూపాక్ష విద్యారణ్య మహాసంస్థానాదీశులు శ్రీ విద్యారణ్య భారతి స్వామిజీ సందర్శించారు. ఆదివారం ఆయన ఇక్కడి గోశాలను పరిశీలించి గోమాతలకు ఆహారాన్ని అందించారు. ఉప్పరపల్లె ఆశ్రమ స్వామిజీతో కలిసి విచ్చేసిన భక్తులకు ఆశీర్వాద తీర్థ ప్రసాదాలను అందించారు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి ఆయన ప్రవచనాలు చేశారు.

వైభవంగా చౌడేశ్వరీదేవి జ్యోతుల ఉత్సవం

జమ్మలమడుగు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మోరగుడి గ్రామంలో ఆదివారం చౌడేశ్వరీదేవి జ్యోతుల మహోత్సవం వైభవంగా జరిగింది. 8వ తేదీ భక్తులు బిందె సేవ కార్యక్రమం నిర్వహించి అమ్మవారికి సమర్పించారు. అదే రోజు రాత్రి చౌడేశ్వరీదేవి ప్రతిరూపమైన జ్యోతులను తయారు చేసి రాత్రి నుంచి గ్రామంలోని వీధుల్లో మెరువణిగా అమ్మవారి వద్దకు వచ్చి సమర్పించారు. ఈ సందర్భంగా చౌడేశ్వరీదేవి అమ్మవారి ఆలయాన్ని విద్యుత్తు దీపాలతో అలంకరించారు.

భక్తులు ట్రాఫిక్‌కు సహకరించాలి : సీఐ

ఖాజీపేట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): నాగనాదేశ్వరున్ని దర్శించుకునేందుకు కొండపైకివచ్చే భక్తులకు ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా సహరించాలని సీఐ వంశీధర్ అన్నారు. ఆదివారం స్థానిక పోలీసు స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతూ కార్తీక మూడవ సోమవారం సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు కొండపైకి వస్తారని, క్యూలైన్‌లో తోపులాట జరుగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని భక్తులు కూడా సహకరించి స్వామివారిని దర్శించుకుని రావాలన్నారు. కొండ కింది భాగంలో వాహనాల పార్కింగ్ కోసం మూడు ఎకరాల స్థలం ఏర్పాటు చేయడం జరిగిందని, వాహనాలు పార్కింగ్ ప్లేస్‌లో పెట్టి ఆటోల్లో కొండపైకి వెళ్లాలన్నారు. అలాగే విలువైన వస్తువుల పట్ల వారు జాగ్రత్తగా ఉండాలన్నారు.

గండికోటలో 26.5 టీఎంసీల నీటిమట్టం

కొండాపురం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టులో ఆదివారం 26.557 టీఎంసీల నీటిమట్టం ఉన్నట్లు ఈఈ ఉమామాహేశ్వర్లు తెలిపారు. ప్రస్తుతం తాగునీటి అవసరాల దృష్ట్యా 20 క్యూసెక్కుల నీరు మాత్రమే బయటికి వదులుతున్నామన్నారు.అదేవిధంగా ప్రస్తుతం ప్రాజెక్టులోకి వచ్చే ఇన్‌ఫ్లో లేదని ఈఈ తెలిపారు. కాగా గండికోట ప్రాజెక్టు పూర్తి నీటి సామర్థ్యం 26.85 టీఎంసీలు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ముద్దనూరు నవంబర్9(ఆంధ్రజ్యోతి):స్థానిక వివేకావర్ధిని జూనియర్ కళాశాల(ఎయిడెడ్)లలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు.1996-98 బ్యాచ్ విద్యార్థినీ, విద్యార్థులు కలుసుకొని, అప్పటి జ్ఞాపకాలు ఒకరినొకరు గుర్తు చేసుకున్నారు. అనంతరం నాటి అధ్యాపకులు ప్రిన్సిపాల్ పెద్దిరెడ్డి, తెలుగు అధ్యాపకులు పుల్లారెడ్డి, సాంబశివారెడ్డి లను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సురేష్‌రెడ్డి, రవి,సంజీవరెడ్డి, వరలక్ష్మి, బాలరాజు,సుబ్బరాయుడు పాల్గొన్నారు.

పోరుమామిళ్లలో ఘనంగా వన మహోత్సవం



వనభోజన మహోత్సవంలో పాల్గొన్న రాయలసీమ సేవా సమతి సభ్యులు, బలిజ సంఘం నేతలు

పోరుమామిళ్ల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసాన్ని పురస్కరించుకొని పోరుమామిళ్ల చెరువు కట్టపై ఉన్న భైరవస్వామి ఆలయం సమీపంలో రాయల సేవా సమితి బలిజ సంఘం ఆధ్వర్యంలో వనభోజన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదివారం స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయం నుంచి పోరుమామిళ్ల చెరువు కట్ట వరకు ర్యాలీగా బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో పోరుమామిళ్ల మేజర్ పంచాయతీ సర్పంచు యనమల సుధాకర్, డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, వైష్ణవి స్కూల్ యజమాని రామకృష్ణ, బద్వేల్ మార్కెట్ యార్డు చైర్మన్ నారిశెట్టి సుప్రజ, టీడీపీ నాయకులు సీతా వెంకటసుబ్బయ్య, పోరుమామిళ్ల ఉపసర్పంచు రాళ్లపల్లె రవి, రాళ్లపల్లె రవికుమార్, తమ్మిశెట్టి రఘురామయ్య, రాయలసీమ సేవా సమితి అధ్యక్షులు వెంకటేశ్వర్లు, ధనిశెట్టి ఓబయ్య, కొంకుల రాంబాబు తదితరులుపాల్గొన్నారు. ఈ సందర్భంగా కోలాటం భజన వంటి కార్యక్రమాలు నిర్వహజంచారు.

బద్వేలులో పలువురు బీజేపీలో చేరిక

బద్వేలు రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ పాలనపట్ల ఆకర్షితులై బీజేపీలోకి పలువురు చేరడం సంతోషంగా ఉందని బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గసభ్యుడు పొలిశెట్టి పవన్‌కుమార్, పట్టణాధ్యక్షుడు వెంకటసుబ్బయ్య రాయల్‌లు పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డుకు చెందిన షేక్‌దావూద్, 33వ వార్డుకు చెందిన యారవ సురేష్‌బాబుతోపాటు పలువురు బీజేపీలో చేరారు. వారిని కండువాతో పార్టీలోకి ఆహ్వానించిన అనంతరం వారు మాట్లాడుతూ రాబోవు మున్సిపాలిటీ ఎన్నికల్లో పార్టీ పటిష్టంగా పనిచేసేందుకు సిద్ధమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా సెక్రటరీ సురేంద్ర, పట్టణ ఉపాధ్యక్షుడు ప్రసాద్, యువమోర్చ జిల్లా జనరల్ సెక్రటరీ అశోక్‌కుమార్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మైలవరం పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేసిన డీఎస్పీ

మైలవరం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మైలవరం పోలీసు స్టేషన్‌ను జమ్మలమడుగు డీఎస్పీ వెంకటేశ్వరరావు ఆదివారం తనిఖీ చేసి కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ రికార్డులను తనిఖీ చేసి పోలీసు స్టేషన్ ప్రాంగణాన్ని పరిశీలించారు. అనంతరం డీఎస్పీ సిబ్బందితో సమావేశమై మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లోని సమాచారాన్ని సేకరించాలని సిబ్బందిని ఆదేశించారు. గ్రామ సమాచార పుస్తకాలను పరిశీలించడంతోపాటు కొత్త క్రిమినల్ చట్టాల ప్రకారం నిర్ణీత సమయంలో వివిధ కేసుల్లో దర్యాప్తు పూర్తి చేయాలని ఎస్ఐని ఆదేశించారు. అనంతరం డాడీ హోంను సందర్శించి అక్కడున్న వృద్ధులు, అనాథ చిన్నారులకు బిస్కెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జమ్మలమడుగు రూరల్ సీఐ బాస్కర్ రెడ్డి, ఎస్ఐ శ్యాంసుందర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జమ్మలమడుగు డీఎస్పీ వెంకటేశ్వరరావు

ఎన్‌జీవో మాజీ అధ్యక్షుడికి ఆత్మీయ సన్మానం

బద్వేలు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఎన్‌జీవో గెజిటెడ్/నాన్ గెజిటెడ్ ఉద్యోగుల ఆధ్వర్యంలో ఆ సంఘం బద్వేలు తాలూకా మాజీ అధ్యక్షుడు రొండా అమర్‌నాథ్‌రెడ్డిని ఆదివారం ఎన్‌జీవో హోంలో ఘన సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏపీ ఎన్‌జీఓ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బలపనూరు శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి నిత్యపూజ, రాష్ట్రఉపాధ్యక్షుడు ప్రసాద్ యాదవ్ లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో బద్వేలు తాలూకా ఎన్‌జీవో సంఘ అధ్యక్షులు టి. శివరామిరెడ్డి, కార్యదర్శి వి. శివరామిరెడ్డి, అసోసియేషన్ అధ్యక్షులు సాధు వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు ఎం.శ్రీనివాసరెడ్డి, మల్లికార్జునరావు, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.



అమర్‌నాథ్‌డ్డిని సన్మానిస్తున్న ఉద్యోగులు

ప్రతి ఒక్కరు ఆధ్యాత్మికతను అలవరచుకోవాలి

జమ్మలమడుగు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను పెంపొందించుకోవాలని మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి అన్నారు. ఆదివారం జమ్మలమడుగు ప్రొద్దుటూరు రోడ్డులో మదరసా ఆవరణలో మసీదు ఏ రియాజుల్ జొన్నహ్ శంకుస్థాపన చేశారు. ఉలమాలు ముఫ్తీలు రియాజ్, అన్సర్‌అలీ, షేక్ ఉస్మాన్‌బాష, హుస్సేన్‌పీరా, షబీల్‌మౌలానా పాల్గొన్నారు.

గంగమ్మకు పూజలు నిర్వహించిన నాయకులు

బద్వేలు రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : బద్వేలు పెద్ద చెరువు అలుగుపారుతుండటంతో ఆదివారం కోఆపరేటీవ్ సొసైటీ గౌరవాధ్యక్షుడు బోలా నారాయణ, అధ్యక్షుడు కందుకూరి చెన్నయ్య గంగమ్మకుపూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు క్రిష్ణ, సెక్రటరీ రవి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

న్యాయసేవలను ప్రజలు వినియోగించుకోవాలి

ప్రొద్దుటూరు రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): నేటి రోజుల్లో న్యాయ సేవలు ప్రజలకు అందుబాటులో ఉన్నాయని వాటిని తప్పకుండా వినియోగించుకోవాలని రెండవ అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయ సేవా అధికార సంస్థ చైర్మన్ కె.సత్యకుమారి పేర్కొన్నారు. ఆదివారం జాతీయ న్యాయ సేవా దినోత్సవం సందర్భంగా స్థానిక సబ్‌జైలులో నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో జిల్లా జడ్జి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సబ్‌జైలు పరిసర ప్రాంతాలను, రికార్డులను, రిమాండ్ ఖైదీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. సదస్సును ఉద్దేశించి జడ్జి మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారు ఉచిత న్యాయ సహాయం పొందవచ్చన్నారు. లోక్ అదాలత్ ద్వారా వివాదాలను సుహృద్భావంతో పరిష్కరించవచ్చన్నారు. జాతీయ న్యాయ సేవా దినోత్సవం సందర్భంగా స్థానిక డిఏడబ్ల్యూ జూనియర్ కళాశాల, గవర్నమెంటు జూనియర్ కళాశాలలో వ్యాసరచన పోటీలను నిర్వహించి ఈ పోటీల్లో గెలుపొందిన మొదటి మూడు స్థానాల విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు.



సబ్‌జైలులో రికార్డులు పరిశీలిస్తున్న రెండవ అదనపు జిల్లా జడ్జి కె.సత్యకుమారి

ఘనంగా న్యాయ సేవా దినోత్సవం

జమ్మలమడుగు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు కోర్టు ఆవరణలో ఆదివారం న్యాయ సేవా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జడ్జి ఆదేశాల మేరకు న్యాయ సేవా దినోత్సవం కార్యక్రమం న్యాయవాదులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సమావేశంలో విద్యార్థులకు ఉచిత న్యాయ సహాయం గురించి, లోక్ అదాలత్, న్యాయ అవగాహన శిబిరాలు, లీగల్ సర్వీసెస్ మహిళా, శిశు రక్షణ తదితర వాటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు బార్ సెక్రటరి మురళీధర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, భూతమాపురం సుబ్బారావు, జయన్న, సుబ్బారెడ్డి, మైలవరం, జమ్మలమడుగు ప్రభుత్వ జూనియర్ కళాశాలల అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



జమ్మలమడుగు కోర్టులో విద్యార్థులకు బహుమతులు అందజేసిన న్యాయవాదులు

డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన రంతు

కలసపాడు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా సాధనకారి ఖాజారహంతుల్లా (రంతు) ఆదివారం విజయవాడలో ప్రమాణస్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించారు. విజయవాడలో ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరిగిన ఈ కార్యక్రమానికి కలసపాడు, పోరుమామిళ్ల, కాశినాయన మండలాల నుంచే కాకుండా బద్వేలు నియోజకవర్గం నుంచి భారీగా టీడీపీ కార్యకర్తలు, నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు ఈ పదవీ బాధ్యతలు అప్పజెప్పిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌కు, అలాగే మంత్రి లోకేశ్‌కు, మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, టీడీపీ ఇన్ చార్జి రితేష్‌రెడ్డిలకు ధన్యవాదాలని తన పదవికి న్యా యం చేకూరుస్తానని తెలిపారు. అనంతరం ఆయనకు శాలువా, పూలమాలలతో టీడీపీ నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కలసపాడు టీడీపీ నాయకులు వెంకటరామిరెడ్డి, పట్టాభిరెడ్డి, చిన్నరంగారెడ్డి, స్వామిరంగారెడ్డి, మల్లికార్జునరెడ్డి, పాములేటి, హజరత్,రోశిరెడ్డి, శ్రావణ్‌కుమార్‌రెడ్డి, మస్తాన్, పెద్దిరెడ్డి రామకృష్ణారెడ్డి, దాదావలి, అన్నారెడ్డి శ్రీనివాసులురెడ్డిలతో పాటుకుటుంబ సభ్యులు వివిధ మండలాల టీడీపీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు. కాగా రాష్ట్రరోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఆదివారం బాధ్యతలు చేపట్టిన సాదనకారి ఖాజా రమంతుల్లాను విజయ వాడలో మండల టీడీపీ నాయకులు ఘనంగా సన్మానించారు.



రోడ్ డెవలప్‌మెంట్ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన ఖాజారహంతుల్లా

పోరుమామిళ్లలో: ఏపీఆర్‌డీసీ డైరెక్టర్‌గా బాధ్యతలు తీసుకుంటున్న సాదనకారి రంతును ఘనంగా సన్మానించారు. ఆదివారం విజయవాడ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ భవనంలో కలవకూరి రమణనాయుడు, శ్రీకాంత్, నాయబ్, నాగేంద్ర, పాపయ్యగణేష్, తదితరులు ఘనంగా సత్కరించారు.

డీసీసీబీ చైర్మన్ గృహప్రవేశానికి తరలిన టీడీపీ శ్రేణులు

బద్వేలుటౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ మంచూరు సూర్యనారాయణరెడ్డి నూతన గృహప్రవేశానికి టీడీపీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. ఆదివారం అట్టహాసంగా జరిగిన ఈ కార్యక్రమానికి టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి (వాసు), కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి, మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదర్, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే బండారు శ్రావణి, స్థానిక మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, టీడీపీ నియోజక వర్గ ఇన్‌చార్జి రితేష్‌కుమార్‌రెడ్డి, బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ బొమ్మన సుబ్బరాయుడు, బీజేపీజిల్లా అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి, పులివెందుల జడ్పీటీసీ లతారెడ్డి, మాచుపల్లె వెంకటక్రిష్ణారెడ్డి, చెరుకూరి రవి, వివిధ రాజకీయనాయకులు, అభిమానులు పాల్గొన్నారు. వచ్చినవారందరికీ విందు భోజనాలు ఏర్పాటు చేశారు.




నూతన గృహప్రవేశానికి హాజరైన మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, రితేష్‌కుమార్‌రెడ్డి

కలసపాడులో: బద్వేల్‌లో ఆదివారం జరిగిన డీసీసీ బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణరెడ్డి నూతన గృహప్రవేశానికి కలసపాడు నుంచి టీడీపీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షుడు బాలి రెడ్డి, కలసపాడు మాజీ ఎంపీటీసీ రామసుబ్బయ్య, చెముడూరు నాగేశ్వరరావు, పల్లె శివరాంరెడ్డి, టీడీపీ యువనాయకులు దుగ్గిరెడ్డి, ప్రహ్లాదరెడ్డి, పుల్లారెడ్డిపల్లె కృష్ణారెడ్డి, సిద్దమూర్తిపల్లె సిద్దారెడ్డిలతో పాటు పలువురు నాయకులు,కార్యకర్తలు పలు వాహనాల్లో తరలివెళ్లారు.

శ్రీచరణిని అభినందించిన టీడీపీ నాయకుడు

దువ్వూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ మహిళా క్రికెట్ ప్లేయర్ శ్రీచరణిని ప్రతాప్ జువెలర్స్ అధినేత, తెలుగుదేశం పార్టీ నాయకుడు పీవీ ప్రతాప్‌నాయుడు, ఆయన భార్య లక్ష్మిదేవితో కలిసి అభినందించారు. ధర్మల్‌లో శ్రీచరణి స్వగృహంలో ఆదివారం కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. మహిళల ప్రపంచ కప్‌లో భారత్ తరుపున వారు నిర్వహించిన పాత్ర అమోఘమని కొనియాడారు. మున్ముందు క్రికెట్‌లో మరిన్ని మైలురాళ్లు అందుకోవాలని శ్రీచరణితో అన్నారు. దువ్వూరు మండలం అన్నపుశాస్త్రులపల్లికి చెందిన ప్రతాప్‌నాయుడు ఈ విషయాన్ని వెల్లడించారు.



శ్రీచరణిని అభినందిస్తున్న ప్రతాప్‌నాయుడు

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ర్యాలీ

మైదుకూరు నవంబరు9(ఆంధ్రజ్యోతి): మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈనెల12 న జరిగే ర్యాలీలో ప్రజలు పాల్గొనాలని పిలుపునిస్తూ ఆదివారం మైదుకూరు వైసీపీ కార్యాలయంలో మాజీ ఎంఎల్‌ఏ శెట్టిపల్లి రఘురామిరెడ్డి ప్రజా ఉద్యమం పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పులివెందుల మెడికల్ కాలేజీలోని అధునాతన పరికరాలను మరొక చోటికి తరలించడం దారుణమన్నారు.

ఇన్‌చార్జి డీఎస్పీగా బాలస్వామిరెడ్డి

ప్రొద్దుటూరు రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పోలీసు సబ్‌డివిజన్ ఇన్‌చార్జి డీఎస్పీగా బాలస్వామిరెడ్డి బాధ్యతలను స్వీకరించారు. స్థానికంగా విధులు నిర్వహిస్తున్న డీఎస్పీ భావన వారం రోజులపాటు సెలవుల్లో వెళ్లడంతో కడప దిశ పోలీసు స్టేషన్‌లో డీఎస్పీగా పని చేస్తున్న బాలస్వామిరెడ్డికి ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించారు. ఈ మేరకు ఆయన ఆదివారం ప్రొద్దుటూరుకు చేరుకుని పోలీసులపై దౌర్జన్యానికి పాల్పడి బియ్యం అక్రమ రవాణా చేసిన నిందితులను త్వరితగతిన పట్టుకోవాలని స్థానిక అధికారులను ఆదేశించారు. అలాగే క్రికెట్‌బెట్టింగ్, మట్కా నిర్వాహకులపై నిఘా ఉంచి వారికి కౌన్సిలింగ్ ఇవ్వాలని సూచించారు.